www.vaarthavedhikasurya.com
RNI: TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

SCAN ME

తెలంగాణ | పేజీలు: 08 | వెల: 5 | సంపుటి:01 | సంచిక: 3 | శనివారం | 07, జూన్ 2025 | ॥ ఎడిటర్ : పోలోజు శ్రీనివాసచారి ॥



## ఆరు నూరైనా మూసీ నదిని ప్రక్షాళన చేస్తాం



- తిరుపతి తరహాలో యాదగిరిగుట్ట అభివృద్ధి
- జపాన్, సింగపూర్ సరసన రాష్ట్రాన్ని నిలబెడతా
- గంధమల్ల రిజర్వాయర్‌ను పూర్తి చేస్తాం
- రూ.1051.45 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**చౌటుప్పల్,జూన్ 6(వార్త వేదిక సూర్య):** తిరుమల తిరుపతి తరహాలో యాదగిరిగుట్టను అభివృద్ధి చేస్తానని, ప్రజలు సహకరిస్తే తెలంగాణను 10 ఏళ్లలో వన్ ట్రిలియన్ ఎకానమీ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దుతానని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు నియోజకవర్గం, తిరుమలాపురం గ్రామంలో సుమారు 1051.45 కోట్ల రూపాయల విలువచేసే పలు అభివృద్ధి పనులకు శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ తెలంగాణ పేద ప్రజలు దేశ పునర్నిర్మాణంలో భాగస్వాములు అయ్యేలా నిలబెడతానని, జపాన్, సింగపూర్ సరసన రాష్ట్రాన్ని నిలుపుతానని అన్నారు. దేశంలో వందేళ్లలో ఎవరు చేయని విధంగా మొదటిసారి కులగణను చేపట్టి రాష్ట్రంలో 56.36% బలహీన వర్గాలు ఉన్నారని లెక్కలు తీశామన్నారు. విద్యా, ఉద్యోగాలలో 42శాతం రిజర్వేషన్లను కల్పిస్తున్నామన్నారు. మహిళలను కోటీశ్వరులుగా చేయడంలో భాగంగా ఉచిత బస్సు సౌకర్యం కల్పించడమే కాకుండా, 600 బస్సులను స్వయం సహాయక మహిళా సంఘాలకు ఇచ్చి వారు వ్యాపార రంగంలో రాణించే విధంగా చేశామని, ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్లు, పెట్రోల్ బంకులు, అమ్మ ఆదర్శ పాఠశాల పనులను, పాఠశాల యూనిఫామ్ కుట్టే బాధ్యతలను మహిళలకు

మిగతా 7లో..

కాశ్మీర్‌లో మరో అద్భుతం ఆవిష్కరణ

## చీనాబ్ రైల్వే వంతెనకు ప్రధాని మోడీ పచ్చజెండా

- రైలు బోగీలో ప్రయాణించిన మోదీ తదితరులు
- ఈఫిల్ టవర్‌కన్నా ఎత్తయిన వంతెనగా ప్రసిద్ధి
- శ్రీనగర్-వైష్ణోదేవి మధ్య నేటి నుంచి రాకపోకలు





**శ్రీనగర్,జూన్6 (వార్త వేదిక సూర్య):** ప్రపంచంలోనే ఎత్తైన చినాబ్ రైల్వే వంతెనను ప్రధాని మోడీ అట్టహాసంగా ప్రారంభించారు. ఆపరేషన్ సిందూర్ తరవాత తొలిసారిగా ప్రధాని మోడీ కాశ్మీర్‌కు వెళ్లారు. శుక్రవారాం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జమ్ము కశ్మీర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ కేంద్రం ఎంతో ప్రతిష్మాత్మకంగా నిర్మించిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జి చీనాబ్ రైలు వంతెనను ప్రధాని ప్రారంభించారు. జెండా ఊపి రైల్వే వంతెనపై రాకపోకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రైల్వే బ్రిడ్జిపై పరుగులు తీసిన కోచ్‌లో ప్రధాని ప్రయాణించారు. ఆయన వెంట కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా కూడా ఉన్నారు. భారత దేశం మరో అద్భుత కట్టడానికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. చీనాబ్ నదిపై ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జి నిర్మాణం జరిగింది. చీనాబ్ రైల్వే బ్రిడ్జిగా పిలువబడుతున్న ఈ బ్రిడ్జి శుక్రవారం ఉదయం ప్రారంభం అయింది. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈ బ్రిడ్జిని ప్రారంభించారు. అనంతరం ఉదమ్‌పూర్.. శ్రీనగర్.. బారాముల్లా రైల్ లింక్ ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు.. ఈ చినాబ్ రైల్వే వంతెన ఈఫిల్ టవర్ కంటే ఎత్తుగా ఉంటుంది. ప్రపంచంలోనే

మిగతా 2లో..

## కేటీఆర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు

- రూ.25వేల కోట్ల అవినీతి ఆరోపణల కేసు
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు సుప్రీం నోటీసులు



**న్యూఢిల్లీ,జూన్ 6(వార్త వేదిక సూర్య):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ చేసిన రూ.25వేల కోట్ల అవినీతి ఆరోపణల కేసులో సుప్రీం నోటీసులిచ్చింది. కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంలో విచారణ జరిగింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సతీశ్ చంద్రశర్మతో కూడిన ధర్మాసనం పిటిషన్‌ను విచారించింది. మూసీ ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.25 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడిందంటూ కేటీఆర్ గతంలో

మిగతా 2లో..

## ఆర్బీఐ సంచలన నిర్ణయం

- కీలక వడ్డీరేట్లు మరోమారు తగ్గింపు
- రెపోరేటును ఏకంగా 50 బేసిస్ పాయింట్ల మేర తగ్గింపు
- గృహ,వాహన రుణాలపై తగ్గనున్న వడ్డీలు..ఇఎంఐలు




**ముంబై,జూన్6(వార్త వేదిక సూర్య):** ఆర్బీఐ సంచలన నిర్ణయం తీసుకుంది. వరుసగా మూడోసారి వడ్డీరేట్లను తగ్గించింది. రెపోరేటును ఏకంగా 50 బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది. దీనివల్ల రెపో రేటు 6 శాతం నుంచి 5.50 శాతానికి దిగొచ్చింది. ఆర్బీఐ తీసుకున్న నిర్ణయంతో గృహ రుణాల వడ్డీరేట్లు 7.5 శాతం తగ్గనున్నాయి. అలాగే బ్యాంకు ఈఎంఐలు తగ్గే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.దేశ ఆర్థిక వృద్ధిని పెంపొందించడం, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడంలో భాగంగా ఈ నిర్ణయం

మిగతా 2లో..

## మావోయిస్ట్ మరో అగ్రనేత భాస్కర్ హతం

- ఛత్తీస్‌ఘడ్‌లో కొనసాగుతున్న ఎన్‌కౌంటర్లు
- మైలారపు ఆడెల్లు అలియాస్ భాస్కర్‌ది ఆదిలాబాద్



**రాయ్‌పూర్,జూన్ 6(వార్త వేదిక సూర్య):** ఛత్తీస్‌గఢ్‌లో వరుస ఎన్‌కౌంటర్లు ఆవోలను హతమారుస్తూనే ఉన్నాయి. ఇప్పటికే జరిగిన వరుస ఎన్‌కౌంటర్లతో మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. తాజాగా రెండోరోజూ ఎన్‌కౌంటర్ జరిగింది. బీజాపూర్ జిల్లాలోని నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో శుక్రవారం భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో మరో కీలక నేత మైలారపు ఆడెల్లు అలియాస్ భాస్కర్ మృతిచెందారు. ఆడెల్లు స్వస్థలం ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం పొచ్చెర గ్రామం. భాస్కర్ కేంద్ర కమిటీతోపాటు రాష్ట్ర కమిటీకి కార్యదర్శిగా పని చేస్తున్నారు. అతి తక్కువ సమయంలోనే రాష్ట్ర కమిటీ స్థాయికి భాస్కర్ ఎదిగారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల రిక్రూట్‌మెంట్‌లో ఆయన కీలక పాత్ర పోషించారు. అతడి తలపై రూ.25లక్షల రివార్డు ఉంది. ఈ ఎన్‌కౌంటర్ జరిగిన ఘటనా స్థలంలో ఏకే 47తోపాటు పలు ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని

మిగతా 2లో..

## నీట్-2025 ఎంట్రన్స్ టెస్ట్ వాయిదా

- ఆగస్టు 3న నిర్వహించనున్న ఎన్‌బీఈ
- వాయిదాను అంగీకరించిన సుప్రీంకోర్టు




**న్యూఢిల్లీ,జూన్6(వార్త వేదిక సూర్య):** నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ నీట్ 2025 పరీక్షను వాయిదా వేయాలన్న నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ అభ్యర్థనకు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఆమోదం తెలిపింది. జూన్ 15వ తేదీన జరగాల్సిన పరీక్షను ఆగస్టు 3వ తేదీన నిర్వహించేందుకు అనుమతి ఇచ్చింది. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా న్యాయమూర్తి పీకే మిశ్రా నేతృత్వంలోని బెంచ్.. పరీక్ష

మిగతా 2లో..

ఇక పట్టణాల్లోనూ

## ఇందిరమ్మ ఇండ్లు

- జీవనోపాధికి ఇబ్బంది లేకుండా పేదలు ఉన్న చోటే జి౦3 పద్ధతిలో ఇండ్ల నిర్మాణం
- గిరిజనులకు ప్రత్యేకంగా 22 వేల ఇండ్లు
- రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్,జూన్ 6(వార్త వేదిక సూర్య):** పేదవాడి సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియ గ్రామీణ ప్రాంతాలలోఒక కొలిక్కి తీసుకువచ్చిన నేపథ్యంలో పట్టణ ప్రాంతాలలో కూడా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై దృష్టి సారించామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్,

మిగతా 2లో..

## పాలమూరు అభివృద్ధే మా లక్ష్యం..

పాలమూరు రంగారెడ్డిని పూర్తి చేసి, బీడు భూములను సస్యశ్యామలం చేస్తాం

- టీఆర్ఎస్ పాలనలో నీళ్లు రాలేదు, నిధులు ఆవిరి అయ్యాయి
- గత పాలకులు దొంగల్లా అందిన కాడికి దోచుకున్నారు
- ప్రపంచంతో పోటీపడేలా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం
- దేవరకద్ర నియోజకవర్గం బహిరంగ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



**దేవరకద్ర,జూన్ 6(వార్త వేదిక సూర్య):** వెనుకబడిన పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేస్తాం, అందుకు కావలసిన నిధులు సంపూర్ణంగా విడుదల చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు.

శుక్రవారం ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలో 12 విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణ పనులకు శంకు స్థాపన అనంతరం స్థానికంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఆర్ & ఆర్, భూ సేకరణకు సంబంధించిన నిధులు వెంటనే విడుదల చేస్తాం, నార్లాపూర్, ఏదుల రిజర్వాయర్ల మధ్య ఉన్న గ్యాప్ ను పూరించేందుకు అవసరమైన నిధులు విడుదల చేస్తాం. ఉద్దండపూర్ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి 70 కోట్లు కావాలి అంటే వాటిని వెంటనే విడుదల చేశాం.

భవిష్యత్తులో ఎన్ని నిధులు అవసరమైతే అన్ని నిధులు విడుదల చేసేందుకు ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

గత పాలకులు

మిగతా 2లో..

## కాళేశ్వరం రిపోర్ట్ త్వరగా బయట పెట్టాలి

- తాత్సారం చేస్తే వదిలే ప్రసక్తి లేదు
- కంఠంపై తుపాకి పెట్టినా నిజాలే చెబుతా
- తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టుకు మహారాష్ట్ర ఒప్పకోలే
- కేబినేట్ ఆమోదం తరవాత త్రీమెన్ కమిటీ వేశారు
- కాళేశ్వరం నిర్ణయం మొత్తం కెసిఆర్‌దే
- జస్టిస్ ఘోష్ కమిషన్ విచారణలో ఈటెల వెల్లడి



**హైదరాబాద్, జూన్ 6(వార్త వేదిక సూర్య):** కాళేశ్వరం రిపోర్ట్ త్వరగా బయట పెట్టాలని.. రిపోర్ట్ విషయంలో తాత్సారం చేస్తే వదిలే ప్రసక్తి లేదని బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. కాళేశ్వరం విచారణ అనంతరం ఎంపీ మీడియాతో మాట్లాడుతూ.. కంఠంపై తుపాకీ పెట్టినా ఈటెల నిజమే మాట్లాడుతారని స్పష్టం చేశారు. ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు డిజైన్లు, నిర్మాణంతో సంబంధం ఉందా అని కమిషన్ అడిగిందని.. తనకేం సంబంధం లేదని చెప్పానన్నారు. కాళేశ్వరం కార్పొరేషన్‌పై అధికారం ఉండేదా అని అడగ్గా.. తనకు ఎలాంటి అధికారం లేదని చెప్పినట్లు తెలిపారు. కాళేశ్వరం నిర్మాణం క్వాలిటీ గురించి ఇంజనీర్లు చూసుకోవాలని.. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హరీష్ నాయకత్వంలో కేబినెట్ సబ్ కమిటీ వేశారన్నారు. మంత్రివర్గ ఉపసంఘం, సీడబ్ల్యూసీ రిపోర్ట్ ఆర్థిక శాఖ ముందు పెట్టారని తెలిపారు. నిజాయితీగా

మిగతా 2లో..



## బనకచర్లపై బిఆర్ఎస్ తరపున సుప్రీంలో కేసు వేస్తాం

- అబద్దాలతో కాలం గడుపుతున్న సిఎం, మంత్రులు
- ఎపి గోదావరి, కృష్ణాలు దోచుకుంటున్నా కళ్లు తెరవరా
- కేంద్రంతో పోరాటం చేయకుండా బిజెపి సైలెంట్ అయ్యింది
- ఉద్యోగులకు డిఎపై కేబినేట్‌లో ఇంతగా చర్చలా
- ప్రభుత్వం తీరుపై మండిపడ్డ హరీష్ రావు

**సిద్దిపేట, జూన్ 6(వార్త వేదిక సూర్య):** అబద్దాలకు బ్రాండ్ అంబాసిడర్ రేవంత్ రెడ్డి అనుకున్నం, కానీ ఆయన్ని మించి తాత అయ్యిండు ఉత్తమ్ కుమార్ రెడ్డి అని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఉత్తమ్ అబద్దాలు చూస్తే గోబెల్స్ అనేవాడు ఉంటే ఉరి పెట్టుకునేవాడు అని హరీశ్‌రావు అన్నారు. దుబ్బాకలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు బీజేపీ ఎంపీలపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

రాష్ట్ర ప్రభుత్వ కేబినెట్ సమావేశం నిరాశపరిచిందని మాజీ మంత్రి హరీష్ రావువ్యాఖ్యలు చేశారు. ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం మరిచిపోయిందన్నారు. గాలి మోటార్‌పై తిరుగుతూ గాలి మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఒక్క డీఏ ఇచ్చేందుకు ముచ్చటగా మూడు కమిటీలు వేశారని... దీనికి కేబినెట్‌లో అయిదు గంటల చర్చ చేశారని వ్యాఖ్యలు చేశారు. ఉద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం నిట్ట నిలువునా

మిగతా 2లో..

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

# నీట్-2025 ఎంట్రన్స్ టెస్ట్ వాయిదా

(మొదటి పేజీ తరువాయి)

వాయిదాపై కేంద్రాన్ని, ఎన్‌బీఈని ప్రశ్నించింది. 'ఇంకా రెండు నెలలు పరీక్షను వాయిదా వేయటం ఎందుకు..జులై రెండు లేదా మూడో వారంలో పరీక్ష నిర్వహించవచ్చుగా' అని అడిగింది. కేంద్రం తరఫున అదనపు సోలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్ స్పందిస్తూ..' లాజిస్టికల్ సవాళ్ల కారణంగా పరీక్ష వాయిదా పడింది. పరీక్ష కేంద్రాల సంఖ్యను రెట్టింపు చేయడం, కఠినమైన భద్రతా ఏర్పాట్లను చేపట్టడం వంటి వాటి కోసం ఈ నిర్ణయం తీసుకోవటం జరిగింది. చిన్న పొరపాట్లు పరీక్ష ప్రక్రియపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే పరీక్షను వాయిదా వేయడానికి ఎన్బీఈ నిర్ణయించిందని తెలిపారు.అనంతరం న్యాయమూర్తి మిశ్రా మాట్లాడుతూ.. ' పరీక్ష ఎప్పుడు జరిగినా నిష్పక్షపాతంగా, సమగ్ర భద్రతతో జరగాలని స్పష్టం చేశారు. గత వారం ఇచ్చిన తీర్పును కూడా సుప్రీంకోర్టు ప్రస్తావించింది. అప్పటి నుంచి మీరు ఏం చేశారంటూ ఎన్‌బీఈని ప్రశ్నించింది. దీనిపై ఎన్‌బీఈ మాట్లాడుతూ.. ' పరీక్ష విషయంలో మేము ఏమాత్రం రాజీ పడదలచుకోవడం లేదని స్పష్టం చేసింది. కాగా, నీట్ పీజీ పరీక్షను రెండు షిఫ్టుల్లో జరపడానికి పర్మిషన్ కోరుతూ ఎన్‌బీఈ గతంలో సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దానిపై విచారణ జరిపిన కోర్టు ఎన్‌బీఈ ప్రతిపాదనను తోసిపుచ్చింది. రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరిగితే విద్యార్థులపై చెడుగా ప్రభావం చూపే అవకాశం ఉందని అభిప్రాయపడింది. దేశ వ్యాప్తంగా ఒకే షిఫ్టులో పరీక్ష పెట్టాలని తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలోనే పరీక్ష ఒకే షిఫ్టులో జరపడానికి మరింత సమయం కావాలని బోర్డు కోరింది. దీనిపై శుక్రవారం విచారణ జరిపిన కోర్టు ఆగస్టు 3వ తేదీన పరీక్ష జరపడానికి అవకాశం కల్పించింది. ఒకే షిఫ్ట్‌లో పరీక్షను ముగించాలని ఇటీవల అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పరీక్ష నిర్వహణ తేదీని జూన్ 15 నుంచి మార్చుకునేందుకు వీలు కల్పించింది. వైద్య విద్యలో పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల ప్రవేశాలకు నిర్వహించే జాతీయస్థాయి అర్హత పరీక్ష (నీట్)కు సంబంధించి ఇటీవల సుప్రీంలో విచారణ జరిగింది. పరీక్షను రెండు షిఫ్ట్‌లలో నిర్వహించడానికి నిరాకరించింది. దానివల్ల కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొంది. పరీక్ష నిర్వహణలో పూర్తి పారదర్శకతను పాటించాలని, సురక్షితమైన పరీక్షా కేంద్రాలనే ఎంచుకోవాలని సూచించింది. రెండు ప్రశ్నపత్రాలు ఎప్పటికీ ఒకేవిధమైన కాఠిన్య లేదా సులభ స్థాయిని కలిగిఉండవని అభిప్రాయపడింది. పోటీ తీవ్రత దృష్ట్యా ప్రతి మార్కు ర్యాంకు నిర్ధరణలో అత్యంత కీలకమేనని తెలిపింది. నార్మలైజేషన్ విధానాన్ని కొన్ని ప్రత్యేక కేసుల్లో మాత్రమే అనుసరించాలని, ప్రతి ఏడాదీ నిర్వహించుకొనే పరీక్షకు అది సరికాదని ధర్మాసనం పేర్కొంది.

# కాళేశ్వరం రిపోర్ట్ త్వరగా బయట పెట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

ఉండాలని కోరే పార్టీ బీజేపీ అని ఎంపీ తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు సృష్టికర్త కేసీఆర్ అని ఆయనే చెప్పుకున్నారని.. ప్రాజెక్టు కట్టాలనే ఆలోచన ఆనాటి ప్రభుత్వానిదే అని స్పష్టం చేశారు. కాళేశ్వరంపై నిర్ణయం తీసుకుంది కేసీఆర్ అని.. అప్పుడు ఆయనే బాస్ అన్నారు. 25 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏ పార్టీలో ఉన్నా విలువలతో ఉన్నట్లు తెలిపారు. తెలంగాణలో మొట్టమొదటి ఆర్థిక మంత్రిగా పనిచేశానన్నారు. తెలంగాణ సాధించుకుంది నీళ్లు, నిధులు, ఉద్యోగాల కోసమని చెప్పారు. 2006లో తుమ్మిడిహట్టి రూ.16 వేలు ఉంటే 2015లో రూ.38 వేల కోట్లకు పెరిగిందన్నారు. తుమ్మిడిహట్టి దగ్గర కట్టాలని అనుకున్నా మహారాష్ట్ర ఒప్పుకోలేదన్నారు. మూడు బ్యారేజీలు సీడబ్ల్యూసీ రిపోర్ట్, టెక్నికల్ కమిటీ ఆధ్వర్యంలో కట్టారన్నారు. మూడు బ్యారేజీలు సబ్ కమిటీ, టెక్నికల్ కమిటీ రిపోర్టు ఆధారంగా కట్టారని వెల్లడించారు. మొదట రూ.63వేల కోట్ల అంచనాతో ప్రారంభం అయితే.. రైతుల డిమాండ్ మేరకు రూ.82 వేల కోట్లకు పోయిందన్నారు. కాళేశ్వరం కార్పొరేషన్ ఏ పర్పస్ కోసం పెట్టారని కమిషన్ ప్రశ్నిస్తే.. కాళేశ్వరం కార్పొరేషన్‌కు ఫైనాన్స్ శాఖకు సంబంధం లేదని చెప్పినట్లు తెలిపారు. 'మా బతుకులో నిబద్ధతతో ఉంది... నా గొంతుపై తుపాకీ పెట్టినా నిజాలే మాట్లాడతా. ఎవరు పిలిచినా ఎక్కడైనా నిజాలే చెప్తా. కొందరు బట్టకాల్చి మీదేస్తే నాకేమీ కాదు' అని అన్నారు. మూడు బ్యారేజీలు రూ.10వేల కోట్ల లోపే

అని చెప్పారు. కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్‌ను త్వరగా బయటపెట్టాలని.. నిజమైన దోషులు ఎవరో ప్రభుత్వం తేల్చాలని రాజేందర్ డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అవకతవకలపై పీసీ ఘోష్ కమిషన్ విచారణ కొనసాగుతోంది. శుక్రవారం బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ కమిషన్ ముందు విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓపెన్ కోర్టులో ఈటెలతో అంతా నిజమే చెప్తానని కమిషన్ ప్రమాణం చేయించింది. అనంతరం కమిషన్ ప్రశ్నలు సంధించింది. కమిషన్ ముందు 113వ సాక్షిగా మాజీ మంత్రి హాజరయ్యారు. దాదాపు 40 నిమిషాల పాటు విచారణ సాగింది. బ్యారేజీల నిర్మాణం, కాళేశ్వరం కార్పొరేషన్, డీపీఆర్‌పై మొత్తం 19 ప్రశ్నలను కమిషన్ సంధించింది. కేబినెట్ నిర్ణయం తీసుకున్న తర్వాతే మూడు బ్యారేజీల నిర్మాణం మొదలుపెట్టామని చెప్పారు. తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ఒప్పుకోలేదని తెలియజేశారు. మహారాష్ట్ర ఒప్పుకోకపోవడంతో 150 నుంచి 148 కుదించామన్నారు.

# కేటీఆర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపణలు చేశారు. దీంతో కేటీఆర్ చేసిన ఆరోపణలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ.. ఉట్నూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ నేత ఫిర్యాదుతో కేటీఆర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని గతంలోనే కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. వాదనలు విన్న హైకోర్టు.. కేటీఆర్‌పై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టి వేస్తూ తీర్పు ఇచ్చింది. అయితే హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుగుణ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై శుక్రవారం విచారణ జరుగగా.. పిటిషన్‌పై సమాధానం చెప్పాలంటూ కేటీఆర్‌కు సుప్రీం ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.

# ఆర్బీఐ సంచలన నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

తీసుకున్నట్లు ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 3.16 శాతంగా ఉంది. ఎస్‌బీఐ నివేదిక ప్రకారం 202526 ఆర్థిక సంవత్సరంలో రెపోరేటు మరో 75 బేసిస్ పాయింట్ల తగ్గింపు జరిగే అవకాశం ఉంటుంది. దీంతో రెపో రేటు 5.0నుంచి 5.25కు చేరుకోవచ్చు. దీనివల్ల బ్యాంకులు కూడా రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించడానికి వీలుంటుంది. వడ్డీ రేట్లను తగ్గించడం ఈ ఏడాదిలో వరుసగా ఇది మూడోసారి అని చెప్పాలి. ఫిబ్రవరి, ఏప్రిల్‌లో 25 బేసిస్ పాయింట్ల చొప్పున తగ్గించారు. తాజాగా మళ్లీ వడ్డీ రేట్లు తగ్గించడం ద్వారా వివిధ రకాల ప్రయోజనాలు కలగనున్నాయి. గృహ, వాహన, వ్యక్తిగత రుణాలపై వడ్డీ రేట్లు తగ్గే అవకాశం ఉంటుంది. కాబట్టి రుణాలు తీసుకున్న వారందరికీ ఇది శుభవార్త అనే చెప్పాలి. నెలవారీ చెల్లింపుల వాయిదా భారం మోస్తున్న గృహ వినియోగదారులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరోసారి శుభవార్త చెప్పిందనే అనుకోవాలి. కీలక వడ్డీరేట్లను ఏకంగా 50 బేసిస్ పాయింట్లు తగ్గించి మరింత ఊరట కల్పించింది. తాజా నిర్ణయంతో గృహ రుణగ్రహీతలపై ఈఎంఐ భారం మరింత తగ్గనుంది.ఫ్లోటింగ్ రేట్‌పై గృహ రుణాన్ని తీసుకున్న వారికి సవరించిన వడ్డీరేటు ఆధారంగా ఊరట లభించనుంది. 2019 అక్టోబర్ 1 తర్వాత జారీ చేసిన గృహ రుణాలన్నీ ఫ్లోటింగ్ రేటుతో జారీ అయినవే. కాబట్టి వారికి బ్యాంకులు ఆ మేరకు వడ్డీ రేట్లను సవరిస్తాయి. పాత వినియోగదారులకే కాదు.. కొత్తగా రుణాలు తీసుకునేవారు తక్కువ వడ్డీకే రుణాలు పొందొచ్చు. పైగా ఎక్కువ మొత్తం రుణం పొందేందుకు అవకాశం ఉంటుందని బ్యాంకింగ్ నిపుణులు చెబుతున్నారు. ఆర్‌బీఐ రెపో రేటు తగ్గించిన నేపథ్యంలో రుణగ్రహీతల ముందు ఇప్పుడు రెండు ఆప్షన్లు ఉండబోతున్నాయి. ఒకటి ఈఎంఐ తగ్గించుకోవడం. రెండోది కాలవ్యవధి తగ్గించుకోవడం. దీంట్లో రెండో ఆప్షన్ ఎంచుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల దీర్ఘకాలంలో ఎక్కువ మొత్తంలో వడ్డీని ఆదా చేసుకోవచ్చని పేర్కొంటున్నారు.

ఉదాహరణకు ఈ ఏడాది జనవరిలో 20 ఏళ్ల కాలవ్యవధికి రూ.50 లక్షల రుణం తీసుకున్నారనుకుందాం. అప్పట్లో బ్యాంకు వడ్డీ రేటు 8.50శాతం ఉంటే.. నెలకు రూ.43,391 చెల్లించాల్సి వచ్చేది. ఇప్పుడు ఆర్‌బీఐ మూడు దఫాల్లో వడ్డీ రేట్లను సవరించడంతో ఈఎంఐ మొత్తం రూ. 40,280కి తగ్గనుంది. అంటే నెలకు దాదాపు రూ.3వేల పైనే ఆదా అవుతుంది.

## మావోయిస్ట్ మరో అగ్రనేత

# భాస్కర్ హతం

(మొదటి పేజీ తరువాయి)

సమాచారం. కాగా మావోలు, భద్రతా దళాల మధ్య ఇంకా ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయి. గురువారం నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారంటూ భద్రతా బలగాలకు సమాచారం అందింది. దీంతో ఈ ప్రాంతంలో భద్రతా బలగాలు, పోలీసులు కూంబింగ్ చేపట్టాయి. ఈ విషయాన్ని మావోయిస్టులు పసిగట్టారు. కూంబింగ్ నిర్వహిస్తున్న భద్రతా బలగాలపైకి కాల్పులు జరిపారు. దీంతో వారు ఎదురుకాల్పులకు దిగారు. ఈ కాల్పుల్లో మావోయిస్టు అగ్రనేత సుధాకర్ మరణించారు. అతడి తలపై రూ. కోటి రివార్డు ఉన్న సంగతి తెలిసిందే. ఇదే ఎన్‌కౌంటర్‌లో పలువురు మావోయిస్టు సైతం మృతిచెందిన విషయం విదితమే. ఇదే ప్రాంతంలో భారీగా ఆయుధాలను సైతం భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మరోవైపు వచ్చే ఏడాది మార్చి నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన పలు ఎన్‌కౌంటర్‌లలో ఇప్పటికే వందలాది మంది మావోయిస్టులు మృతి చెందారు. అలాగే ప్రభుత్వం ఎదుట మరికొంతమంది మావోయిస్టులు లొంగిపోయారు. ఇంకొంతమంది మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

# చీనాబ్ రైల్వే వంతెనకు ప్రధాని మోడీ పచ్చజెండా

(మొదటి పేజీ తరువాయి)

ఎత్తైన రైల్వే వంతెన చినాబ్ సొంతం. అలాంటి రైల్వే వంతెనను ప్రధాని మోడీ శుక్రవారం జాతికి అంకితం చేశారు. రూ.46వేల కోట్లతో ఈ ప్రాజెక్టును నిర్మించారు. శ్రీ మాతా వైష్ణో దేవి కత్రా నుంచి శ్రీనగర్ వరకు వందే భారత్ రైలును కూడా జెండా ఊపి ప్రారంభించారు. వంతెన కారణంగాఈ మార్గం ప్రధానంగా పర్యాట రంగాన్ని మరింత ఆకర్షించనుంది. శ్రీ మాతా వైష్ణో దేవి ఆలయాన్ని వందలాది మంది యాత్రికులు దర్శిస్తుం టారు. ఈ రైల్వే వంతెన ప్రారంభంతో పర్యాటకరంగంగా మరింత పుంజుకోనుంది. ఈ చినాబ్ బ్రిడ్జి 1,315 మీటర్లు విస్తరించి ఉంది. కఠినమైన వాతావరణాన్ని కూడా ఈ వంతెన తట్టుకోగలదు. ఈ ప్రాంతం భూకంపం జోన్ 5లో ఉంది. ఇంజనీర్లు అత్యంత అద్భుతంగా ప్రణాళికలు వేసి ఈ బ్రిడ్జిని నిర్మించారు. గంటకు 260 కిలోమీటర్ల వేగంతో ప్రచండమైన గాలులు వీచినా ఈ వంతెనకు ఏం కాదు. బలమైన గాలులు తట్టుకునే విధంగా నిర్మించారు. ఇక వంతెన నిర్మించడానికి దాదాపు 30,000 టన్నుల ఉక్కును ఉపయోగిం చారు. ప్రస్తుతం ఇదే ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే ఆర్చ్ వంతెనగా నిలుస్తుంది. చీనాబ్ వంతెన నిర్మాణం 2002లో వాజ్‌పేయ్ హయాంలో ప్రారంభించగా 2022లో మోడీ హయాంలో పూర్తయ్యింది. ఉధంపూర్ శ్రీనగర్ బారాముల్లా రైలు మార్గం ప్రాజెక్టులో భాగంగా ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించి విజయవంతంగా ముగించారు. శనివారం నుంచి శ్రీ మాతా వైష్ణో దేవి కత్రా రైల్వే స్టేషన్ నుంచి శ్రీనగర్ వరకు వందే భారత్ రైళ్లు పరిగెత్తనున్నాయి. ప్రధాని ప్రారంభించిన చీనాబ్ రైల్వే బ్రిడ్జి ప్రత్యేకతల విషయానికి వస్తే.. ఇది ఈఫిల్ టవర్ కంటే చాలా ఎత్తైనది. ఈఫిల్ టవర్ ఎత్తు 330 మీటర్లు మాత్రమే. కానీ, ఈ బ్రిడ్జి ఏకంగా 359 మీటర్ల ఎత్తులో ఉంది. ఈ బ్రిడ్జి పొడవు 1,315 మీటర్లు. కట్టింగ్ ఎడ్జ్ ఇంజనీరింగ్ టెక్నాలజీతో దీన్ని నిర్మించారు. ఈ బ్రిడ్జి గంటకు 266 కిలోమీటర్ల వేగంతో గాలి వీచినా కూడా ఏమాత్రం చెక్కు చెదరదు. ఈ బ్రిడ్జిలో ఆసక్తికరమైన మరో ప్రత్యేకత ఏంటంటే.. ఆ బ్రిడ్జి బ్లాస్ట్ రెసిస్టంట్ స్టీలు, కాంక్రీట్‌తో తయారు అయింది. బాంబు దాడులను సైతం బ్రిడ్జి తట్టుకుని నిలబడగలదు.

## ఇక పట్టణాల్లోనూ

# ఇందిరమ్మ ఇండ్లు

(మొదటి పేజీ తరువాయి)

సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పట్టణాల్లోని మురికి వాడల్లో జీవనం కొనసాగిస్తున్న పేదలు అక్కడే ఉండడానికి ఇష్టపడుతున్నారని ముఖ్యంగా హైదరాబాద్ కు దూరంగా ఇండ్లు నిర్మించి ఇస్తే తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశంతో ఇండ్లు తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదన్నారు. హైదరాబాద్‌కు దూరంగా గతంలో 42 వేల ఇండ్లను నిర్మించగా సుమారు 19 వేల మంది మాత్రమే అక్కడికి వెళ్లారు.

ఇటీవల క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలన జరుపగా కేవలం 13 వేల మంది మాత్రమే ఆ నివాసాలలో ఉంటున్నట్లు తేలిందన్నారు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని పట్టణ ప్రాంతాలలో ప్రధానంగా హైదరాబాద్ నగరంలోని మురికి వాడల్లో పేదలు ఉన్నచోటే జి౦3 పద్ధతిలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా తొలివిడతలో హైదరాబాద్‌లో 16 మురికి వాడలను గుర్తించామని. అలాగే వరంగల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ కరీంనగర్ తదితర పట్టణాలలో కూడా ఇదే విధానాన్ని అమలు చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. ఏండ్ల తరబడి నిలువ నీడలేక, తలదాచుకోవడానికి గూడు లేని చెంచులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన మేరకు భద్రాచలం, ఉట్నూరు, ఏటూరు నాగారం, మున్ననూరు నాలుగు ఐటిడిఏ పరిధిలోగల చెంచు, కొలం, తోటి, కొండరెడ్లకు 13,266 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని తెలిపారు. రాష్ట్రంలోని 16 ఎస్టీ నియోజకవర్గాలకు ఇప్పటికే 8,750 ఇండ్లు మంజూరు చేశామని దీనితో కలిపి గిరిజనులకు ఇంతవరకు 22,016 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ ఇండ్లకు తక్షణమే లబ్దిదారులను గుర్తించి ఇండ్ల నిర్మాణ ప్రక్రియను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, నిర్మాణంలో మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఇండ్ల నిర్మాణం జరిగేలా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.

దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా పేదవాళ్ల ఇంటికోసం ఐదు లక్షల రూపాయిలు ఖర్చు చేయడం లేదని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వడమే ఈ ప్రభుత్వ లక్ష్యమని , దీనికి అనుగుణంగా అధికార యంత్రాంగం పనిచేయాలని అన్నారు.

# పాలమూరు అభివృద్ధే మా లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

దొంగల మాదిరి అందిన కాడికి దోచుకున్నారు, ఇప్పుడు దయ్యాల ఇక హట్టహాసం చేస్తున్నారు, నాటి పాలకులకు ప్రజలపై ప్రేమ లేదని వారి కుటుంబ సభ్యులే వాస్తవాలను బయటపెడుతున్నారని డిప్యూటీ సీఎం తెలిపారు. నిజమైన ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టేందుకు, ప్రజలకు నిధులను ఖర్చు పెడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్ తెలంగాణ రాష్ట్రం ప్రపంచం తోనే పోటీపడేలా పరిపాలన చేస్తుంది, ప్రపంచం మొత్తం తెలంగాణ వైపు చూసేలా పాలనను కొనసాగిస్తున్నామని డిప్యూటీ సీఎం అన్నారు. ప్రజా ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు అండదండలు ఉండాలని కోరారు.

వ్యాపారాలు, కాంట్రాక్టులు చేయాలనుకుంటే ఎమ్మెల్యేలు కావాల్సిన అవసరం లేదని.. ప్రజల గొంతుకై శాసనసభలో మాట్లాడి ప్రజల అవసరాలను తీర్చి ప్రజాస్వామ్యంలో ఓటు విలువ పెంచే ఎమ్మెల్యేలను ఎన్నుకున్నందుకు మహబూబ్నగర్ ప్రజలను డిప్యూటీ సీఎం అభినందించారు. మాది ప్రజా ప్రభుత్వం ప్రజల ఆశలు, ఆశయాలే నిజంగా పనిచేస్తాం, వారి ఆశయాలే మా లక్ష్యంగా పరిపాలన అందిస్తాం అని డిప్యూటీ సీఎం తెలిపారు. కృష్ణా నది ఒడ్డున ఉన్న పాలమూరు బిడ్డలు ఆ నీళ్లను వారి భూముల్లో పారించుకునేందుకు ప్రత్యేక రాష్ట్రం తీసుకొని వచ్చారు, అయితే 10 ఏళ్ల కాలంలో గత పాలకులు ఒక్క ఎకరాకు సాగునీరు ఇవ్వలేదని విమర్శించారు. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో ఆనాడు చేపట్టిన జూరాల, కోయిల్ సాగర్, బీమా, నెట్టెంపాడు, కల్వకుర్తి ప్రాజెక్టులన్నీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేశామని గుర్తు చేశారు.

నాటి కాంగ్రెస్ పాలకులు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అనుమతిస్తే 2015 జూన్ మాసంలో కరివేన ప్రాజెక్టు దగ్గర నాటి సీఎం కేసీఆర్ పునాది వేసి మూడు సంవత్సరాల్లో పూర్తి చేస్తాను అని హామీ ఇచ్చారు, పది సంవత్సరాలు అయిన నీళ్లు ఎందుకు పారించలేకపోయారని డిప్యూటీ సీఎం ప్రశ్నించారు.

ఎన్నికల ముందు హడావుడిగా నార్లాపూర్ వద్ద పంపు స్విచ్ ఆన్ చేసి వెంటనే ఆఫ్ చేసి అద్భుతం చేశాం, పాలమూరు బంగారం అయ్యిందని అరచేతిలో వైకుంఠం చూపారు, చందమామ కథలు వినిపించారని డిప్యూటీ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు.

బొంబాయి ,బొగ్గు భాయి, దుబాయి అని పాటలు చెప్పిన వాళ్ళు అభివృద్ధిని పక్కనపెట్టి వెళ్లిపోయారు.. బాగా వెనుకబడిన పాలమూరు జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి పాలమూరు పండుగ పేరుతో బహిరంగ సభ నిర్వహించి యావత్ క్యాబినెట్ ను ఆహ్వానించి వివరించిన విషయాన్ని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు.

సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తిని యావత్ క్యాబినెట్ అర్థం చేసుకొని విద్యుత్తు, సాగునీరు, విద్యా, వైద్యం, రోడ్లు ఇలా అన్ని రంగాల్లో పాలమూరు అభివృద్ధి చేసేందుకు కావలసిన నిధులు మంత్రివర్గం అందిస్తుందని వివరించారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి వంటి పథకాలతో పాటు ఐదు లక్షలతో ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తున్నాం అన్నారు. మొదటి దశలో ప్రతి నియోజకవర్గంలో 3,500 చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 22,500 కోట్లతో మనసున్న ప్రభుత్వం హృదయంతో ఆలోచించి నాలుగున్నర లక్షల ఇళ్లు నిర్మిస్తుంది అన్నారు. 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు 24 గంటల పాటు ఉచితంగా విద్యుత్తు సర్వరా చేస్తున్నాం ఇందుగాను ప్రతి సంవత్సరం విద్యుత్ శాఖకు రాష్ట్ర ప్రభుత్వం 12,500 కోట్లు కడుతుంది అన్నారు.

200 యూనిట్ల వరకు విద్యుత్ బిల్లు చెల్లించాల్సిన పనిలేదని, పేదలకు డబ్బులు మిగలాలనే ఆలోచనతో ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకువచ్చిని అన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు పథకం ద్వారా రాష్ట్రంలో 50 లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయి ఈ పథకానికి ప్రభుత్వం ఏడాదికి 200 కోట్లు చెల్లిస్తుందని వివరించారు. ఒక దేవరకద్ర నియోజకవర్గం లోని 45,155 మంది అంటే 71 ఒక శాతం గృహ జ్యోతి పథకాన్ని వినియోగించుకుంటున్నారని వివరించారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మహిళలు ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణిస్తున్నారు గతంలో ఆర్థికంగా బలంగా ఉన్న టిఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకాలను ఎందుకు అమలు చేయలేకపోయిందని ప్రశ్నించారు. జనంలో సగభాగమైన మహిళలను ఐదు సంవత్సరాలలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని ప్రజా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి సంవత్సరం 21 వేల కోట్లు వడ్డీ లేని రుణాలు స్వయం సహాయక సంఘాలకు అందించామని తెలిపారు.

టిఆర్ఎస్ నాయకులకు 10 సంవత్సరాలపాటు మహిళలు ఎందుకు గుర్తు రాలేదని ప్రశ్నించారు. బలహీనవర్గాల పిల్లలు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన పాఠశాలల్లో చదివించాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయించింది ఇందుకోసం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 25 ఎకరాల్లో 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నాం అన్నారు. ఇప్పటికే వంద శాసనసభ నియోజకవర్గాల్లో భూమి పూజలు చేశామని తెలిపారు.

10 సంవత్సరాల పాటు పరిపాలించిన వారికి పేద బిడ్డలు చదువుకునే గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో డైట్ చార్జీలు పెంచాలన్న ఆలోచన రాలేదు, ఇందిరమ్మ ప్రభుత్వం రాగానే మన బిడ్డలు బాగా తింటేనే చదువులపై దృష్టి పెట్టగలుగుతారని ఆలోచించి 40 శాతం డైట్ చార్జీలు 200% కాస్మొటిక్ చార్జీలు పెంచామని తెలిపారు.

కోరి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో 10 సంవత్సరాల పాటు నిరుద్యోగుల ఆశలు ఆవిరి అయ్యాయి, వారి కళలను నిజం చేసేందుకు ప్రజా ప్రభుత్వం మొదటి సంవత్సరంలోనే 56వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసింది మరో 30 వేల ఉద్యోగాలు త్వరలో భర్తీ చేయబోతున్నాం అని డిప్యూటీ సీఎం తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగాలు రాని యువత వారి కాలపై వాళ్ళు నిలబడేందుకు ఎనిమిది వేల కోట్లతో ఐదు లక్షల మందికి స్వయం ఉపాధి కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం అనే పదాన్ని త్వరలో ప్రారంభించబోతున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు.

సోనియాగాంధీ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం అడవి బిడ్డల కోసం వారు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇచ్చారు. గిరిజన బిడ్డలు సాగు చేసుకునేందుకు పోతే వారినీ ట్రాక్టర్లు, బుల్డోజర్లతో గత పాలకులు తొక్కించారు, అడ్డం పోయిన గిరిజన మహిళలను చెట్టుకు కట్టేసి కొట్టిన చరిత్ర గత పాలకులు ది అని డిప్యూటీ సీఎం భట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం రాగానే గిరిజన బిడ్డలు ఆత్మగౌరవంతో తలెత్తుకొని బతికేలా ఇందిరా సౌర గిరిజల వికాసం అనే పథకాన్ని తీసుకువచ్చాం అన్నారు. రాష్ట్రంలోని గిరిజనుల ఆధీనంలో ఉన్న 6.70 లక్షల ఎకరాల్లో ఉచితంగా బోరు బావులు, సోలార్ పంపుసెట్లు, అవకాడో వంటి మొక్కలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

## బనకచర్లపై బిఆర్ఎస్ తరపున

# సుప్రీంలో కేసు వేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ముంచుతోందన్నారు. తక్షణమే మూడు డీఏలు చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. ఉద్యోగస్తులపై సర్కార్ కేసులు పెడుతోందన్నారు. ప్రతి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు అప్పులు తెచ్చి గ్రామాల్లో పనులు నిర్వహిస్తున్నారని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అబద్ధాలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మించిపోయారని వ్యాఖ్యలు చేశారు. ఉత్తమ్ కుమార్ ఏది మాట్లాడినా అబద్దమే అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో క్రాప్ హాలిడే ప్రకటించిందన్నారు. 65 టీఎంసీల నీటిని ఉపయోగించకుండా చేసింది ఉత్తమ్ అంటూ ఆరోపించారు. నీతి ఆయోగ్ మీటింగ్‌లో ప్రధానిని రేవంత్ రెడ్డి ఎందుకు ప్రశ్నించలేదని అడిగారు. గోదావరి బనకచర్ల కోసం బీఆర్ఎస్ పార్టీ సుప్రీంకోర్టు వెళ్తుందన్నారు. గోదావరి బనకచర్ల మీద బీజేపీ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. శ్రీశైలం రైడింగ్ ప్రాజెక్టు పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టును ఉత్తమ్ కుమార్ రెడ్డి అడ్డుకోవాలన్నారు. కాళేశ్వరం కుప్ప కూలిందని చెప్పే రేవంత్ రెడ్డి గంధమళ్ళకు నీళ్లు ఎక్కడి నుంచి వస్తాయని ప్రశ్నించారు. కాళేశ్వరం కూలిందని కాంగ్రెస్ ప్రభుత్వం గ్లోబల్ ప్రచారం చేస్తోందని మాజీ మంత్రి హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను స్టే తెచ్చి ఆపిందే బిఆర్ఎస్, కేసీఆర్ అని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి విజయవాడకు పోయి చంద్రబాబును కలిసి బజ్జీలు తిని వచ్చిండు. అప్పటి నుంచి ఏం మాట్లాడటం లేదు. కృష్ణా నది జలాల్లో రాష్ట్ర చరిత్రలో ఎప్పుడు వాడనంత తక్కువ నీళ్లు వాడింది కాంగ్రెస్ ప్రభుత్వం. ఆంధ్రాకు దాసోహం చేసి, ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్‌లో పంటలను ఎండబెట్టింది కాంగ్రెస్. తాత్కాలిక కేటాయింపుల ప్రకారం, 65 టీఎంసీలు తక్కువ వాడిన చేతగాని దద్దమ్మ ప్రభుత్వం. ఆరున్నర లక్ష ఎకరాలకు నీళ్లు ఇవ్వకపోవడమే, పంట ఎండబెట్టడమే. దీనికి సమాధానం చెప్పు, చెంపేలేసుకొని ముక్కు భూమికి రాయి ఉత్తమ్ కుమార్ రెడ్డి అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కేబినెట్‌లో బనకచర్ల గురించి మాట్లాడేందుకు సమయం లేదా? ఇంతకంటే ముఖ్యమైన అంశం ఇంకోటి ఉంటదా? ఐదు గంటలు కమిషన్లు, పర్సెంటేజీలు, హైకమాండ్‌కు పంపే మూటల గురించి మాట్లాడారా? 400 టీఎంసీల గోదావరి జలాలను అక్రమంగా ఏపీ తరలిస్తుంటే గుడ్లు అప్పగించుకొని చూస్తారా? సుప్రీం కోర్టుకు వెళ్లరా, కేంద్ర మంత్రిని కలవరా, నీతి అయోగ్‌లో సీఎం ఎందుకు మాట్లాడలేదు. ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నట్లు హరీశ్‌రావు పేర్కొన్నారు. అపెక్స్ కమిటీ అనుమతి లేకుండా, అంతర్ రాష్ట్ర అనుమతి లేకుండా, గోదావరి ట్రిబ్యునల్ అనుమతి లేకుండా ప్రాజెక్టు కడుతుంటే ఎందుకు మౌనం. చంద్రబాబును ఎదురించే దమ్ము సత్తా లేదా, ఎందుకు లాగులు తడుస్తున్నాయి. ఎందుకు సుప్రీం కోర్టుకు వెళ్లరు, ఎందుకు ప్రధానిని ప్రశ్నించరు. బాధ్యత లేకుండా వ్యవహరిస్తు న్నారు. పూర్తిగా ఏపీకి దాసోహం అయిపోయారు. రాష్ట్రం స్పందించకుంటే సుప్రీం కోర్టుకు బిఆర్ఎస్ వెళ్తుందని చెప్పినం. ఇప్పటికీ ఆ మాటకు కట్టుబడి ఉన్నామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. లేఖలు రాసి చేతులు దులుపుకుంటన్నారు. అఖిల పక్షాన్ని కేంద్రం వద్దకు తీసుకు వెళ్లాలి, జంతర్ మంతర్ వద్ద ధర్నా చేద్దాం పదండి. కృష్ణా నదిలో న్యాయమైన వాటా కిందకి వదిలింది మీరు, గోదావరి బనకచర్ల కడుతుంటే చేతులు కట్టుకొని చూస్తున్నది మీరు, శ్రీశైలం రైట్ కెనాల్ లైనింగ్ జరుగుతుంటే ఆపకుండా చూస్తున్నది మీరు, బిఆర్ఎస్ లైనింగ్ పనులు ఆపిస్తే ఇప్పుడు మీరు వచ్చాక మొదలు పెట్టారు. తక్షణం ఆ పనులను నిలిపి వేయించాలని డిమాండ్ చేసారు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే బిజేపీ పెదవి విప్పడం లేదు. గోదావరి బనకచర్ల మీద బిజేపీ నాయకులు, కేంద్ర మంత్రులు ఎందుకు మాట్లాడటం లేదు. రాష్ట్ర ప్రయోజనాలు బిజెపికి పట్టవా? బనకచర్ల ద్వారా తెలంగాణ గోదావరిలో వాటా కోల్పోయే పరిస్థితి? శ్రీశైలం రైట్ బ్యాంక్ కెనాల్ లైనింగ్ పూర్తి అయితే రోజుకు 90వేల క్యూసెక్కుల చొప్పున తరలిస్తారు. బిజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు కండ్లు తెరవండి. ఏపీ నీటి దోపిడిని అడ్డుకోవాల్సిన కేఆర్ఎంబీ చంద్రబాబు అడుగులకు మడుగులు ఒత్తుతున్నది. శ్రీశైలం రైట్ బ్యాంక్ కెనాల్ లైనింగ్ అక్రమ పనులు ఆపడం లేదు? గోదావరి బనకచర్ల అక్రమ ప్రాజెక్టును ఆపడం లేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. గంధమల్ల ప్రాజెక్టు అంటే కాళేశ్వరంలో అంతర్భాగం. కాళేశ్వరం కూలితే గంధమల్లకు నీళ్లు ఎలా వస్తాయి రేవంత్ రెడ్డి. గంధమల్లకు ఎట్ల కొబ్బరి కాయ కొడుతున్నవు. గంధమల్ల, మల్లన్నసాగర్, రంగనాయర్ సాగర్, మిడ్ మానేర్, ఎల్లంపల్లి.. ఇదంతా కాళేశ్వరం కాదా రేవంత్ రెడ్డి. కుప్పకూలింది అని ప్రచారం చేసావు. కాళేశ్వరం కూలితే గంధమల్లకు గోదావరి జిలాలు ఎట్ల వస్తాయి. నువ్వు ఇన్ని రోజులు చేసిన ప్రచారం శుద్ధ తప్పు అని తేటతెల్లమైంది. నువ్వు చేసింది అదంతా గోబెల్స్ ప్రచారం అరని తేలిందన్నారు. మూసీలో గోదావరి నీళ్లు పోస్తా అంటవు, ఎట్ల సాధ్యమైతది రేవంత్ రెడ్డి? అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

# కోకాపేటలో ఛత్రపతి శివాజీ విగ్రహం ఆవిష్కరణ చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**గండి పేట్ 06 జూన్ (వార్త వేదిక సూర్య):** నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట గ్రామంలో హిందూ ధర్మ స్థాపకుడు, మహానాయకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. విగ్రహ ఆవిష్కరణ అనంతరం జరిగిన అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ మన దేశ చరిత్రలో ఒక విప్లవాత్మక నాయకుడు. ఆయన ధైర్యం, దేశభక్తి, హిందూ ధర్మ పరిరక్షణలో చేసిన కృషి ఈ తరాల వారికి ప్రేరణగా నిలుస్తుంది. కోకాపేటలో శివాజీ విగ్రహ ఆవిష్కరణ చేయడం గర్వకారణం. యువత శివాజీ జీవితం నుండి పాఠాలు నేర్చుకుని దేశసేవలో ముందుండాలి. ఈ విగ్రహం ప్రాంతీయ గౌరవానికి చిహ్నంగా నిలవాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, పిసిసి ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్,గండిపేట మండల అధ్యక్షుడు అశోక్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు ఉషారాణి,అమరేందర్ రెడ్డి,ఆదిత్య రెడ్డి, శివారెడ్డి, దుర్గేష్ యాదవ్ స్థానిక నాయకులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.






## గార్బేజ్ కవర్స్ పంపిణీ చేసిన కార్పొరేటర్: కంది శైలజ శ్రీకాంత్

**సికింద్రాబాద్, జూన్ 06(వార్తా వేదిక సూర్య):** బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని బౌద్ధనగర్ డివిజన్ కౌసర్ మజీద్ నందు గార్బేజ్ కవర్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా స్థానిక కార్పొరేటర్ కంది



శైలజ శ్రీకాంత్ సిఐ మధుసూదన్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ముందుగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మరియు పరిసర ప్రాంతాల ప్రజలందరికీ ముస్లిం సోదరి సోదరీమణులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా డివిజన్ ప్రజలందరూ కూడా చెత్త రోడ్ల మీదా కాకుండా చెత్త ఆటోలో వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, బిఆర్ఎస్ పార్టీ నేతలు బెజ్జంకి రాజేష్, బాబా ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు

## బాబుల్ రెడ్డి నగర్‌లో అంగన్వాడీ బాట కార్యక్రమానికి విశేష స్పందన : కనకవ్వ

**మైలర్‌దేవ్‌పల్లి, జూన్ 06(వార్తా వేదిక సూర్య):** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలర్ దేవ్ పల్లి సెక్టార్, శేర్లింగంపల్లి ప్రాజెక్ట్‌లో ఉన్న బాబుల్ రెడ్డి నగర్ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం " అంగన్వాడీ బాట" కార్యక్రమాన్ని అంగన్వాడీ



టీచర్ కనకవ్వ ఆధ్వర్యంలో నిర్వహించారు. పిల్లలు, తల్లిదండ్రులు, ఆశా కార్యకర్తలు, యువత తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు. విధివీధిలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ కనకవ్వ మాట్లాడుతూ పిల్లలు అంగన్వాడీ వాతావరణానికి దగ్గరయ్యేలా, తల్లిదండ్రులలో అవగాహన పెంచేందుకు అంగన్వాడీ బాట కార్యక్రమం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుంది. చిన్నారుల భవిష్యత్తు మెరుగవ్వాలంటే ప్రాథమిక స్థాయిలోనే బలమైన పునాదులు అవసరం. అందుకే ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలి అని ఆమె పేర్కొన్నారు.

## ముస్లిం సోదరి సోదరీమణులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు

### టియుటిఎఫ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సయ్యద్ రూహీ

**సికింద్రాబాద్, జూన్ 06(వార్తా వేదిక సూర్య):** తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మరియు పరిసర ప్రాంతాల ప్రజలందరికీ తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టియుటిఎఫ్) రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఎంపిపిఎస్ ఆర్ కె పురం ఎస్జీటీ సయ్యద్ రూహీ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ... మానవత్వానికి ప్రతీక, త్యాగానికి గుర్తుగా నిలిచే పవిత్ర బక్రీద్ పండుగ సందర్భంగా ప్రతి ఇంటా ఆనందం, ప్రతి మనసా శాంతితో నిండిపోవాలని కోరుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు అదేవిధంగా ఆ యొక్క అల్లాహ్ ఆశీస్సులు ఎల్లపుడూ తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ ఉండాలని కోరారు.



## ముని్సిపల్ కార్యాలయంలో హెల్త్ క్యాంప్ నిర్వహణ

**మోత్కూరు, జూన్ 06 (వార్తా వేదిక సూర్య):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మున్సిపాలిటీలలో 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక లో భాగంగా శుక్రవారం నాడు మోత్కూరు మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులకు హెల్త్ క్యాంప్ నిర్వహణ నిర్వహించినట్లు మున్సిపల్ కమీషనర్ కే సతీష్ కుమార్ శుక్రవారం నాడు ఒక ప్రకటన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి అమరావతి, ఏ.ఎన్.ఎం సైదమ్మ, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్స్ శ్రవణ్ కుమార్, శా ఇన్స్పెక్టర్ వీరస్వామి, ఆశా వర్కర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## బక్రీద్ పండుగను పురస్కరించుకుని గార్బేజ్ కవర్స్ పంపిణీ చేసిన కార్పొరేటర్ డాక్టర్ హేమ సామల

**సికింద్రాబాద్, జూన్ 06(వార్తా వేదిక సూర్య):** బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని డివిజన్‌లోని పరిశుభ్రతగా ఉంచేందుకు స్వచ్ఛతను కాపాడేందుకు అవసరమైన గార్బేజ్ కవర్స్‌ను కార్పొరేటర్ డాక్టర్ హేమ సామల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండుగ రోజుల్లో మన పరిసరాల్లో పరిశుభ్రత అత్యంత అవసరం. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ముందుగానే చర్యలు తీసుకుంటున్నాం అని ఇప్పటికే GHMC శానిటేషన్ అధికారులను సమన్వయం చేస్తూ పారిశుధ్య నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశాం అని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు మానవత్వానికి ప్రతీక, త్యాగానికి గుర్తుగా నిలిచే పవిత్ర బక్రీద్ పండుగ సందర్భంగా ప్రతి ఇంటా ఆనందం, ప్రతి మనసా శాంతితో నిండిపోవాలని కోరుకుంటున్నట్లు ఆమె తెలిపారు. ఎమ్మెల్యే పద్మారావు గారి సహకారంతో చిలకలగూడ గ్రౌండ్ లో మేకల స్టాల్ సంబంధించి ఆ ఏర్పాట్లను పరిశీలించారు ఈ కార్యక్రమంలో బి అర్ ఎస్ నాయకులు జాకీర్,జహంగీర్, బాలాజీ, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రైవేట్ స్కూల్‌లకు పోటీగా ప్రభుత్వ పాఠశాలలు

### ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య - సమాజం మద్దతుగా నిలవాలి: ఏర్వ కుమారస్వామి : బాబుల్ రెడ్డి నగర్‌లో ప్రత్యేక సమావేశం

**మైలర్‌దేవ్‌పల్లి, జూన్ 06(వార్తా వేదిక సూర్య):** రాజేంద్రనగర్ సర్కిల్ మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్ ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, అంగన్వాడీ టీచర్లు, ఆర్పీలు, ఆశ వర్కర్లు, యువత తదితరులు భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనిత మాట్లాడుతూ...ప్రభుత్వ పాఠశాలలు ఇకపై ప్రైవేట్ పాఠశాలలతో పోటీపడుతూ నాణ్యమైన విద్యను అందిస్తున్నాయి. అనుభవజ్ఞ టీచర్లు, మౌలిక వసతులతో పిల్లలకు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధన కొనసాగుతోంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన నవయువ యూత్ క్లబ్



అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి మాట్లాడుతూ... పిల్లల భవిష్యత్తు బలంగా ఉండాలంటే బేసిక్ విద్య బలంగా ఉండాలి. ప్రభుత్వ పాఠశాలల్లో వస్తున్న సానుకూల మార్పులకు మనం సమర్థంగా మద్దతు ఇవ్వాలి. సమాజంలో స్థిరమైన మార్పు రావాలంటే పిల్లలకు మంచి విద్యా వాతావరణం కల్పించడమే మార్గం అని వివరించారు. కార్యక్రమం చివర్లో విద్యా ప్రమాణాలపై చర్చ జరగడంతో పాటు, తల్లిదండ్రుల నుండి సూచనలు, అభిప్రాయాలు స్వీకరించారు. ఈ సమావేశంలో అంగన్వాడీ టీచర్లు అనిత, మాధవి, ఆర్పీ హేమలత, ఆశ వర్కర్లు రేణుక, లక్ష్మి, మాన్యమ్మ, మంగ, ఉపాధ్యాయులు వినోద్, పార్వతి, విజేశ్వరి, హెల్పర్ సంగీత తదితరులు పాల్గొన్నారు.





# సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసిన మాజీ ఎమ్మెల్యే

**పెద్దశంకరంపేట,జూన్ 06(వార్తా వేదిక సూర్య):** పెద్ద శంకరంపేట్ మండలంలోని పరిధిలో టెంకటి గ్రామానికి చెందిన గడ్డం సాయమ్మ గారి ఆసుపత్రి వేద ఖర్చుల కొరకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 16,000 రూపాయలు.

మర్చట్ పల్లి గ్రామానికి చెందిన శైలజ గారి ఆసుపత్రి వైద్య ఖర్చుల కొరకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 39,000 రూపాయలు. బూరుగుపల్లి గ్రామానికి చెందిన సాయిలు గారి ఆసుపత్రి వైద్య ఖర్చుల కొరకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 14,500 రూపాయల చెక్కులను లబ్ధిదారులకు అందజేసిన నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి వారితోపాటు మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మి రమేష్, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు సురేష్ గౌడ్,సుభాష్, మాజీ ఎంపీటీసీ దత్తు, మాజీ సర్పంచ్ అశోక్, నాయకులు మాణిక్ రెడ్డి,కోణం అంజయ్య, కిష్టయ్య, అంజయ్య, విట్టల్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## జైపురి కాలనీ పాఠశాలలో గ్రామ సభ : నూతన విద్యా సంవత్సరం ప్రారంభం

**ఎల్ బి నగర్, జూన్ 6(వార్త వేదిక సూర్య):** జైపురి కాలనీ పాఠశాలలో గ్రామసభ నూతన విద్యా సంవత్సరం ప్రారంభ కానున్న సందర్భంగా ఆచార్య జయ శంకర్ బడి బాట కార్యక్రమం లో భాగంగా శుక్రవారం ఉప్పల్ మండలం నాగోల్ డివిజన్ పరిధిలోని జై పురి కాలనీలోని మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు బత్తుల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మంచి సౌకర్యాలతో పాటు ఉత్తమ విద్యా వంతులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్యను అందిస్తామని తల్లి దండ్రులు ఆలోచించి మీ పిల్లలను మన బస్తీలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. రోజు వారీ బడి బాట షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు ఉంటాయని గత విద్యా సంవత్సరంలో నమోదు 79 కంటే ఎక్కువ సంఖ్యలో నమోదు చేసే విధంగా ప్రయత్నిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సామాజిక సేవకులు సరస్వతి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని మేము కూడా పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తామని



తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనంత రెడ్డి, మేరీ బ్యూల టీచర్, అంగన్వాడీ టీచర్ లు లలిత, మేఘమాల తల్లిదండ్రులు పాల్గొన్నారు. అదేవిధంగా నేడు తొలి రోజు ముగ్గురు విద్యార్థులను నమోదు చేసుకున్నామని వారు తెలిపారు.





# బేడ బుడ్గ జంగం విద్యార్థిని విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవం

### హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు గగనం ముంతప్ప

**ఎల్ బి నగర్, జూన్ 6(వార్త వేదిక సూర్య):** బేడ బుడ్గ జంగం హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో బేడ బుడ్గ జంగం కులానికి చెందిన విద్యార్థినీ, విద్యార్థులకు పదవ తరగతి మరియు ఇంటర్ ప్రథమ, ద్వితీయ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రతిభ పురస్కారాల ప్రదానోత్సవం. బీ.సీ.సీ.ఇ. భవన్ 2వ అంతస్తు ఆదిత్య హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ ప్రగతి కాలేజీ పక్కన సుల్తాన్ బజార్ కోటి హైదరాబాద్ లో బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు గగనం మంతప్ప, ఫౌండర్ %ఽ% వ్యవస్థాపక చైర్పర్సన్ గగనం శ్రీనివాసులు, రాష్ట్ర అధ్యక్షులు గగనం శేఖర్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్ ఆర్ వెంకటేశం, మాజీ డిఎస్పి మాదనం గంగాధర్, హైకోర్టు అడ్వకేట్ రాచూరి శివరాజు, బేడ బుడగ జంగం నెట్వర్క్ కళ్లెం అంజనేయులు, గగనం వెంకటస్వామి, సిరుపాటి వేణు, అతిథిగా పాల్గొని నిర్వహించి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో చదువుపై మక్కువ పెంచుకోవాలి. అలాగే క్రమశిక్షణ, ప్రణాళిక సంకల్పం మంచిదైతే విజయం తనంతట తానే దరి చేరుతుందన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే జీవితంలో ముందు కెళ్లడం విద్యార్థులు విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు.



అవసరం మేరకే సెల్ఫోన్ వినియోగించాలి చక్కగా చదువుకొని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, గ్రామానికి మంచి పేరు తీసుకొచ్చి సమాజానికి ఉపయోగపడేలా ఎదగాలని అనంతరం పదవ తరగతి మరియు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలలో అత్యుత్తమ మార్కులు సాధించిన బేడ బుడ్గ జంగం విద్యార్థిని విద్యార్థులకు పరీక్షా ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను 76 మందిని ఎంపిక చేసి మొదటి, రెండవ, మూడవ నగదు బహుమతులను అందజేసి . ప్రశంస పత్రం, మెమొంటోలతో సత్కరించారు. బేడ బుడ్గ జంగం సీనియర్ నాయకులకు మెడల్స్, కళాకారులకు మెడల్స్, విద్యార్థిని విద్యార్థులకు డాక్టర్స్ సీట్లు పొందిన వాళ్లకు మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో బేడ బుడ్గ జంగం హక్కుల పోరాట సమితి గౌరవ అధ్యక్షులు సిరివాటి శ్రీనివాసులు, వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పాటి శ్రీనివాసులు, గడ్డం కృష్ణ, సోషల్ మీడియా అధ్యక్షులు దూపం అంజనేయులు, ఉపాధ్యక్షులు చల్ల వెంకటేష్, కోశాధికారి కోటయ్య, సీనియర్ నాయకులు సిరివాటి రామకృష్ణ, విభుతి నారాయణ తాటికొండ ఆంజనేయులు, కొండపల్లి క్రిష్ణయ్య, మిర్యాల వెంకటయ్య, సోషల్ మీడియా కన్వీనర్స్ వారణాసి శివవర్మ, సిరిగిరి చిత్ర సేన, కార్యదర్శి దుద్దుకురి వెంకటేష్, మహిళా కన్వీనర్స్ సిరిగిరి పారిజాత, గగనం దుర్గమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**- ఎం.ఈ.ఓ తీపిరెడ్డి గోపాల్ రెడ్డి**



**మోత్కూరు, జూన్ 06(వార్తా వేదిక సూర్య):** మండలంలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా చేపట్టిన బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులంతా కలిసికట్టుగా 'బడిబాట" కార్యక్రమాలలో పాల్గొని విజయవంతం చేయాలని మండల విద్యాధికారి, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాల ప్రధానోపాధ్యాయులు తీపి రెడ్డి గోపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నాడు మోత్కూరు మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బడిబాట కార్యక్రమాన్ని కొత్త ప్రారంభించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి కొత్త బస్టాండ్ మీదుగా బిక్కేరు బ్రిడ్జి వరకు అక్కడి నుంచి ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పట్టణంలో విద్యార్థుల ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చదివిస్తే ఏలాంటి ప్రయోజనాలు కలుగతుందో విద్యార్థి తల్లిదండ్రులకు వివరించారు. 2024బి 25 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలోని పదవ తరగతి ఫలితాలలో 70% ప్రభుత్వ పాఠశాలలో 100% ఫలితాలు సాధించాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకే ట్రిబుల్ ఐటీ వంటి కళాశాలలో మొదటి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. విద్యార్థి తల్లిదండ్రులు తమ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాల చేర్పించాలని గోపాల్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తౌర్ర ఉప్పలయ్య, దేవినేని అరవిందరాయుడు, అంజయ్య, ఇండ్ల రాంప్రసాద్, వెంకటయ్య, శ్రీనివాస్, లలిత కుమారి, రవీందర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, అక్కినపల్లి వెంకటచారి, శ్రీనివాస్, రవికుమార్, లింగయ్య , మర్రి జయశ్రీ, స్వప్న, మొల్కల వెంకటేశ్వర్లు, విమల, అశోక్, పి. డి. వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.






# రామన్నపేటలో నాగార్జున పాఠశాల ప్రారంభం




**రామన్నపేట,జూన్ 06(వార్తా వేదిక సూర్య):** రామన్నపేట మండల కేంద్రంలో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాసిం డాక్టర్ నకిరేకంటి నాగరాజు నెలకొల్పిన నాగార్జున యుపిఎస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య రంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఒకనాడు మేము ప్రైవేటు పాఠశాలల్లో వ్యతిరేకంగా ఉద్యమించామని వారు తెలిపారు. ప్రైవేటు పాఠశాలలు అంటే కార్పొరేట్ పాఠశాలను వ్యతిరేకించమని, ఇప్పుడు నెలకొల్పుతున్న పాఠశాలలో నిరుద్యోగ విద్యాధికులు ఏర్పాటు చేసే పాఠశాలల వల్ల వారు ఉపాధి పొందుతూ పదిమందికి ఉపాధి కల్పిస్తున్నారని వారు అన్నారు. మంచి నాణ్యతతో కూడిన విద్యను అందించాలని, తద్వారా విద్య రంగంలో నెల తొక్కుకుంటారని వారు సూచించారు. విలువలతో కూడిన నాణ్యమైన విద్యా అందించడం ద్వారా సమాజంలో కూడా విలువలు పెరుగుతాయి అన్నారు. విద్యా అనే జ్ఞానం మాతృభాష ద్వారానే సంతృప్తిగా అమ్ముతుందని వారు తెలిపారు. ఐదవ తరగతి వరకు మాతృభాష నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయులకు మంచి వేతనం ఇవ్వాలని వారు సూచించారు. అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని తెలుపుతూ పాఠశాల యాజమాన్యానికి ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ సోషల్ సైన్సెస్ ఈఎం ఆర్ సి డైరెక్టర్ రఘుపతి, పిఎసిఎస్ చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డి ,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి ,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గంగుల వెంకట రాజారెడ్డి , జినుకల ప్రభాకర్, జెల్ల వెంకటేష్ ,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మహమ్మద్ జమీరుద్దీన్, గుత్తా నరసింహారెడ్డి ,బొడ్డు సురేందర్ రావు ,గోదాసు శ్రీమన్నారాయణ, బండారు వీరబాబు, మంద సురేష్, పార్టీ హైదరాబాద్ జిల్లా జాయింట్ సెక్రెటరీ స్టాలిన్, గొలుసుల ప్రసాద్ ,కొమ్ము శేఖర్, యాదాసు యాదయ్య, గురుకు శివ తదితరులు పాల్గొన్నారు.

## రానున్న ఎన్నికల్లో భాజపా బలోపతానికి
# కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



**మోత్కూరు, జూన్ 06(వార్తా వేదిక సూర్య):** రానున్న స్థానిక ఎన్నికలలో భా.జ.పా. కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని భా.జ.పా జిల్లా కోశాధికారి గుజ్జ సోమ నర్సయ్య మండల అధ్యక్షుడు గుదే మధుసూదన్ యాదవ్ లు పిలుపునిచ్చారు. శుక్రవారం నాడు మోత్కూరు మండల కేంద్రంలో భా.జ.పా . మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం 14 రకాల వరి, ఇతర పంటలకు మద్దతు ధర కల్పించధని , కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు పెడుతుందని వాటిని తీసు కెళ్లాలని పార్టీ నాయకులకు సూచించారు. ఈ సందర్భంగా భా.జ.పా. మండల నూతన కమిటీ ప్రకటించారు. మండల ఉపాధ్యక్షులుగా రాధారపు మల్లేశం, లెల్లెల బాల నర్సయ్య, నార్సింగ్ మహేష్, గుంటి సతీష్ ప్రధాన కార్యదర్శులుగా పైళ్ళ సతీష్, వేముల దశరథ, కార్యదర్శులు గా బండ నర్సింహ్మా, బత్తిని సతీష్, బండారి నరేష్, సూతరపు వెంకన్న, కోశాధికారి కడమంచి యాదమ్మ, సైదులు వీరితోపాటు మండలంలోని 10 గ్రామాలకు 14 బూత్ ల నుండి 35 మంది ని మండల కార్యవర్గ సభ్యులు నియమించినట్లు సోమ నర్సయ్య, మధుసూదన్ యాదవ్ తెలిపారు. నూతన నూతన కార్యవర్గానికి అపార్టీ జిల్లా నాయకులు ఏనుగు జితేందర్ రెడ్డి, భీముడి తిరుమలరెడ్డి, అభినందనలు తెలిపారు.

# జిఎంపిఎస్ మండల నూతన కమిటీ ఎన్నిక

**అధ్యక్ష, కార్యదర్శులుగా దేవునూరి బాలయ్య, పాక జహంగీర్**




**భువనగిరి, జూన్ 06(వార్తా వేదిక సూర్య):** జిఎంపిఎస్ మండల నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా దేవునూరి బాలయ్య, పాక జహంగీర్ ఎన్నికైనట్లు జిఎంపిఎస్ జిల్లా అధ్యక్షులు దయ్యాల నరసింహ తెలిపారు. జిఎంపిఎస్ మండల కమిటీ ఎన్నిక శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. వారితో పాటుగా మండల ఉపాధ్యక్షులుగా పార్వతి దశరథ, తోటకూరి అశోక్, సహాయ కార్యదర్శిగా వడ్డే జమదగ్ని, వడి నాగరాజు, కోశాధికారిగా గంగనబోయిన పాండు, మండల కార్యవర్గ సభ్యులుగా ఏశ బోయిన అంజయ్య, గజ్జి నరసింహ, మన్నెబోయిన రాజలింగం, కదిరే జంగయ్య, తెలజూరి మల్లేష్, బిట్కూరి లక్ష్మయ్య, మదిరే రాజయ్య, కుకుట్ల కృష్ణ, రసాల చంద్రయ్య లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండల నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి రెండవసారి ఎన్నిక చేసినందుకు తమకు మరింత బాధ్యత పెరిగిందని, గొర్రెల మేకల పెంపందర్ల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తానని తెలిపారు. తమ ఎన్నికలకు సహకరించిన గొర్రెల మేకల పెంపందారుల జిల్లా కమిటీ సభ్యులకు, మండల కమిటీ సభ్యులకు, గొర్ల కాపరులకు కృతజ్ఞతలు తెలిపారు.





## ముత్తిరెడ్డిగూడెంలో ఘనంగా
# ఎమ్మెల్యే ఐలయ్య జన్మదిన వేడుకలు

**మహిళ సిబ్బందికి చీరలు పంపిణీ....**

**కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్న కాంగ్రెస్ శ్రేణులు**

**ముత్తిరెడ్డిగూడెం గ్రామ శాఖ అధ్యక్షులు నూనెముంతల సంతోష్ ఆధ్వర్యంలో వేడుకలు**

**మోటకొండూరు,జూన్ 06(వార్తా వేదిక సూర్య):** మూటకొండూర్ మండలం ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో గ్రామ శాఖ అధ్యక్షుడు నూనెముంతల సంతోష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్, ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు అనంతరం మహిళ సిబ్బందికి చీరలు పంపిణీ చేశారు .ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చాడ శశిధర్ రెడ్డి, బొడిగె బిక్షపతి, మాజీ ఉప సర్పంచ్ కొమ్మగాని ప్రభాకర్, ఏకు సంజీవ రెడ్డి, పంతుల రవీందర్, బచ్చె రాములు, ఓర్సు యాదగిరి, ఎరుకల యాదగిరి, ప్రధాన కార్యదర్శి దేవరాజు సిద్దిరాములు, ఎరుకలి ఉపేందర్, పన్నీరు నర్సింహ్మా, పంతుల భూపాల్, కొంగరి అయిలయ్య, మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది , గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సమస్య పరిష్కారానికే
# భూ భారతి రెవిన్యూ సదస్సులు

**మోత్కూరు, జూన్ 06(వార్తా వేదిక సూర్య):** రాష్ట్రంలో వివిధ కారణాలతో పెండింగ్ లో ఉన్న భూ సమస్యలను పరిష్కారానికై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని, ఈ సదస్సులలో రైతులు నేరుగా తమ దరఖాస్తుల ద్వారా సమస్యను పరిష్కరించుకోవచ్చని తహాశీల్దార్ పి.జ్యోతి అన్నారు. శుక్రవారం నాడు మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని బుజిలాపురం గ్రామంలో భూభారతి రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహాశీల్దార్ ఎం. ఉపేందర్, ఆర్ ఐ లు, శ్రీనివాస్, సుమన్, కృష్ణ రికార్డు అసిస్టెంట్లు దాసరి వీరన్న, బుంగ చరణ్ రాజ్, రెవెన్యూ సిబ్బంది నర్సింహ్మా, స్వామి, ఎల్లేష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన శ్రీనివాస్

**మోత్కూరు, జూన్ 06(వార్తా వేదిక సూర్య):** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పేద వర్గాల సమస్యలపై నిరంతరం కృషి చేస్తూ..ఆలేరు అభివృద్ధికి అండగా ఉంటున్న ప్రభుత్వ విప్ , ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయి లయ్య జన్మదిన సందర్భంగా శుక్రవారం



నాడు ఆయనను యాదగిరిగుట్టలో ఆయన నివాసంలో పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసినట్లు ఎన్.ఎస్.యు.ఐ. మోత్కూరు మండల అధ్యక్షులు నిమ్మల శ్రీనివాస్ యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, భవిష్యత్ లో ఉన్న స్థాయికి ఎదగాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. ఆయన మెంట ఎన్ ఎస్ యు.ఐ. మండల నాయకులు నల్లబోలు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబాలకి ఆర్థిక సహాయం

**మోత్కూరు, జూన్ 06(వార్తా వేదిక సూర్య):** మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని బుజిలాపురం గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన పంగ నర్సమ్మ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. నిరుపేద కుటుంబానికి చెందిన పంగ నర్సమ్మ కుటుంబానికి బి. ఆర్. ఎస్. జిల్లా నాయకులు, కే.బి.ఆర్. ( కోక బిక్షం, రేణుక) ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కోక బిక్షం నర్సమ్మ భౌతిక కాయాన్ని శుక్రవారం నాడు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు..అనంతరం ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చి 5 వేలు రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బి.ఆర్. ఎస్.నాయకులు గన్నెబోయిన వీరస్వామి, గన్నెబోయిన నర్సింహ్మా, భూపతి బుచ్చిరాములు, అంబటి బిక్షం, గ్రామస్థులు అంబటి చంద్రయ్య, పంగ యాదయ్య, పంగ లక్ష్మయ్య, పంగ వెంకన్న, పంగ నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానం, యాదగిరిగుట్ట

**తేదీ : 06/05/2025, శుక్రవారం**

**శ్రీస్వామి వారి ఆదాయము రూ: 27,74,347/-**

**శ్రీ స్వామి వారికి 1320 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.**

| | | |
|---|---|---|
| కళ్యాణ కట్ట | - | 66,000/- |
| ప్రధాన బుకింగ్ | - | 1,81,700/- |
| కైంకర్యములు | - | 10,200/- |
| సుప్రభాతం. | - | 5,100/- |
| బ్రేక్ దర్శనం. | - | 1,77,300/- |
| వ్రతాలు | - | 1,82,400/- |
| వాహన పూజలు | - | 18,100/- |
| VIP దర్శనం | - | 3,45,000/- |
| ప్రచారశాఖ | - | 12,250/- |
| పాతగుట్ట | - | 52,440/- |
| కొండపైకి వాహన ప్రవేశం | - | 3,53,000/- |
| యాదఋషి నిలయం | - | 1,45,246/- |
| సువర్ణ పుష్పార్చన | - | 37,916/- |
| శివాలయం | - | 8,700/- |
| శాశ్వత పూజలు. | - | 10,000/- |
| పుష్కరణి | - | 500/- |
| ప్రసాదవిక్రయం | - | 10,58,350/- |
| లాకర్స్ | - | 380/- |
| అన్నదానం | - | 1,08,690/- |
| విమాన గోపురం | - | Nill |
| లీజెస్ | - | Nill |
| ఇతరములు | - | Nill |











## నేషనల్ మెరిట్ స్కాలర్షిప్‌కు ఎంపికైన సిరిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు

**రామన్నపేట, జూన్ 06(వార్తా వేదిక సూర్య):** రామన్నపేట మండల పరిధిలోని సిరిపురం ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు బింగి నవ్యశ్రీ,, కడారి లింగస్వామి నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్ (ఎన్ఎంఎంఎస్) కు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె. పురుషోత్తం రెడ్డి తెలిపారు. వీరికి నెలకి వెయ్యి రూపాయల చొప్పున తొమ్మిదవ తరగతి నుండి ఇంటర్ పూర్తి అయ్యే వరకు నాలుగు సంవత్సరాలు స్కాలర్షిప్ వస్తుందని తెలిపారు.ఇటీవల విడుదలైన పదవతరగతి ఫలితాల్లో 100% ఉత్తీర్ణత సాధించారు.ఇదే స్ఫూర్తితో తోటి విద్యార్థులు బాగా చదవాలని గ్రామ విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ బడులో చదివించాలని కోరారు. మండలంలో స్కాలర్షిప్ సాధించిన ఘనత సిరిపురం పాఠశాలకు దక్కడం సంతోషం అన్నారు. విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజలో పాల్గొన్న మాజీ జడ్పీటీసీ సభ్యులు కొడిత్యాల నరేందర్ గుప్తా

**ఆత్మకూరు (ఎం), జూన్ 06 (వార్త వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం పల్లెర్ల గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులైన దుర్గం మత్యగిరి, ఉప్పరబోయిన దుర్గయ్య, సాంగపక రాజు, సంగి కృష్ణ, లోడి యాదయ్య,ఏలే సిద్దిరాముల వారి ఇండ్ల భూమి పూజ కార్యక్ర



మంలో మాజీ జెడ్పిటిసి సభ్యులు కొడిత్యాల నరేందర్ గుప్తా పాల్గొన్నారు. వారితో పాటు మాజీ ఎంపీటీసీ సోలిపురం మల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకు లు ఇందిరమ్మ కమిటీ మెంబర్స్ వస్తుపుల ఎల్లయ్య ఏలూరు సుదర్శన్ గ్రామ పంచాయితీ సెక్రెటరీ ఇంజ నరేష్ కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు సామ నల్లారెడ్డి ఉప్పరబోయిన దుర్గయ్య మేడి శ్రీనివాస్ జి. నవీన్ బ్రహ్మాచారి ఇందిరమ్మ ఇళ్ళ లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

## చిత్తాపురం అంగన్వాడి కేంద్రంలో బడిబాట

**వలిగొండ, జూన్ 06(వార్తా వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని చిత్తాపురం అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. రెండున్నర సంవత్సరాల నుంచి ఐదేళ్లలోపు బడి ఈడు పిల్లల్ని తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు పంపాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసిడిఎస్



సిడిపిఓ వెంకటరమణ మేడం సూపర్వైజర్ బాలమణి పాల్గొని మాట్లాడుతూ చిన్నారులకు మానసిక,శారీరక వృద్ధి, వ్యాధి నిరోధక టీకాలు, ఆరోగ్య పరీక్షలు, పౌష్టికాహారం, ఆటపాటలతో కూడిన విద్య, సామూహిక అక్షరాభ్యాసాలు, పాలు, గుడ్డు, ఒక పూట సంపూర్ణ ఆహారం అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ మంజుల, ఆశవర్కర్ కవిత, గ్రామ పంచాయతీ సెక్రటరీ జలంధర్ రెడ్డి, ప్రీస్కూల్ తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలేరు బహిరంగ సభకు విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి స్వాగతం పలికిన తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్

**మోత్కూరు, జూన్ 06 (వార్తా వేదిక సూర్య):** ఆలేరు నియోజక వర్గాన్ని అభివృద్ధి ధ్యేయంగా ఆలేరు నియోజవర్గ బహిరంగ సభలో భాగంగా ప్రభుత్వ విప్ ,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య చేపట్టిన తుర్కపల్లి మండలం తిరుమలాపూర్ గ్రామంలో శుక్రవారం నాడు ఏర్పాటు చేసిన సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి కి తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట



భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ పాల్గొన్నట్లు సామేల్ తెలిపారు.

## 9,10,11 తేదీలలో గుట్ట జరిగే సి.పి.ఐ.(ఎం) రాజకీయ శిక్షణ జయప్రదం చేయండి

**మోత్కూరు, జూన్ 06(వార్తా వేదిక సూర్య):** జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించేందుకు ఈనెల 9 ,10,11 తేదీలలో సిపిఐ (ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో యాదగిరిగుట్టలో రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి తెలిపారు. శుక్రవారం నాడు ఈ మేరకు సిపిఐ(ఎం) పట్టణ శాఖ ఆధ్వర్యంలో స్థానిక సుందరయ్య కాలనీలో అందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రాజకీయ శిక్షణ తరగతులలో రాజకీయ సైద్ధంతిక నిర్మాణ అంశాలను రాష్ట్ర, జిల్లా నాయకులు వివరించనున్నారని ,మండలంలోని అన్ని గ్రామ శాఖ



కార్యదర్శులు, మండల కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సి.పి.ఎం. పట్టణ పట్టణ కార్యదర్శి రాచకొండ



రాములమ్మ, పట్టణ కమిటీ సభ్యులు కూరెళ్ళ నర్సింహ్మా,, కూరపాటి రాములు, మెతుకు అంజయ్య, కందుకూరి నర్సింహ్మా, ఎండి తహరా తదితరులు పాల్గోన్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు

**మోత్కూరు, జూన్ 06(వార్తా వేదిక సూర్య):** మోత్కూరు మున్సిపల్ పరిధిలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న విగ్రహాల ప్రతిష్ట మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆలయంలో నూతనంగా శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠంచనున్న ధ్వజ స్థంభం, నవగ్రహాలు, వీరభద్రుడు, కాలభైరవుడు, పార్వతి దేవి, జంట నాగుల, విగ్రహాలను ఆలయ ప్రాంగణంలో శుక్రవారం నాడు ప్రజల సందర్శన కోసం ఉంచడంతో స్థానికులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గుండగోని రామచంద్రుగౌడ్, ఆలయ కమిటీ సభ్యులు బయ్యని రాజు, గుండు శ్రీను నేత, మందుల సురేష్, పట్టూరి అంజయ్య,



బుర్ర యాదయ్య, ఉయ్యాల అంజయ్య కోల శ్రీను, బుర్ర కృష్ణ,



దినేష్ బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరు (ఎం)లో బడి - బాటపై గ్రామ సభ

**ఆత్మకూరు (ఎం), జూన్ 06 (వార్త వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆచార్య జయశంకర్ బడి బాటలో భాగంగా నేడు ఆత్మకూరు మండల కేంద్రం లోని గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహించడం జరిగింది. ఈ సందర్బంగా మండల విద్యాధికారి, గేజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కే. మహాదేవరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో, అనుభవం, అంకిత భావం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని అన్నారు. మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పీఎంశ్రీ కింద ఎంపిక అయినదని, కంప్యూటర్ ల్యాబ్,ఐఎఫ్పి డిజిటల్ బోర్డ్స్, లాంటి ఆధునిక సదుపాయాలు కలిగిఉందని, తెలిపారు.

డిజిటల్ విద్యతో పాటు, రాగిజావ, గుడ్డు తో కూడినమధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్య, నోటుపుస్తకాలు, 2జతల యూనిఫామ్ ఇస్తున్నామని తెలిపారు.

ఇన్ని సదుపాయాలతో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించి ప్రభుత్వ పాఠశాలాలను రక్షించు కోవాలని అన్నారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ప్రాధమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాందయాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పురప్రముఖులు, అంగన్వాడి టీచర్లు,మహిళా సంఘాలు, అమ్మ ఆదర్శపాఠశాల కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.






## ఘనంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు గౌడ్ జన్మదిన వేడుకలు

**మోత్కూరు,జూన్ 06 ( వార్తా వేదిక సూర్య):** మోత్కూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గుండగోని రామచంద్రుగౌడ్ జన్మదినం సందర్భంగా శుక్రవారం నాడు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు గుర్రం లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి నివాసంలో లక్ష్మీ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో రామచంద్రుకు శాలువాలు కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయం మార్కెట్ డైరెక్టర్ పన్నాల శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టూరి అంజయ్య, బయ్యని రాజు, బైరు యాకస్వామి, కోల దినేష్, బండారి వెంకట్ రెడ్డి, రామలింగం, లక్ష్మణ్ శర్మ, గూడ అంజయ్య, పంజాల శంకర్ తదితరు పాల్గొన్నారు.

### ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పుట్టినరోజు సందర్భంగా

## పంచాయతీ సిబ్బందికి చీరల పంపిణీ

**ఆత్మకూరు (ఎం), జూన్ 06(వార్తా వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం పరిధిలోని సింగారం గ్రామంలో ఆలేరు నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత , ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు . అనంతరం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సహకారంతో గ్రామ పంచాయతీ సిబ్బందికి చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జామ యాదయ్య, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు దాసరి చంద్రమౌళి, గ్రామశాఖ ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేష్, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు , మాజీ వార్డు సభ్యులు అంబటి రవి కిరణ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు దేవరపల్లి ప్రభాకర్ రెడ్డి, పంజాల



కనకయ్య , పంజాల భద్రాద్రి , దాసరి నాగరాజు , వల్లాల అనిల్ , సిద్ధులు , గ్రామశాఖ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చెంగోజు రామాచారి , వి బి కే వనిత , ఫీల్డ్ అసిస్టెంట్ పంజాల నాగమణి, ఆశా కార్యకర్త వన్నాల లక్ష్మీ , గ్రామ పంచాయతీ సిబ్బంది శ్రీను, రాజయ్య, మహిపాల్, పద్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పుట్టినరోజు వేడుకలు

### గ్రామ పంచాయతీ సిబ్బందికి చీరల పంపిణీ

**ఆత్మకూరు (ఎం), జూన్ 06 (వార్త వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం పల్లెర్ల గ్రామంలో ఆలేరు నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ కేకు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సహకారంతో గ్రామపంచాయతీ సిబ్బందికి చీరలను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కోడిత్యాల నరేంద్ర గుప్తా పల్లెర్ల గ్రామపంచాయతీ సెక్రటరీ ఇంజ నరేష్ మాజీ ఎంపీటీసీ సోలిపురం మల్లారెడ్డి ఏలూరు సుదర్శన్ సామ నల్లారెడ్డి వస్తువుల ఎల్లయ్య తండ గోపి కొమ్ము ముత్తయ్య కానుకుంట్ల శ్రీను ఆశ వర్కర్లు చంద్రకళ కవిత మేడి అలివేల కొమ్ము ఉమా వంగపల్లి సునీత లోడీ అనసూర్య నోముల స్వామి మేడి యాదయ్య కానుకుంట్ల వెంకటేష్ కానుకుంట్ల రామనర్సయ్య వస్తువుల పాపయ్య మేడి రామ లక్ష్మయ్య లోడి మల్లేష్ లోడీ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి పనకబండలో శ్రీకారం

**మోత్కూరు, జూన్ 06 (వార్త వేదిక సూర్య):** మోత్కూరు మండలం పనకబండ గ్రామంలో ఇటీవల మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శుక్రవారం నాడు ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వాతి ముగ్గులు పోసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు చెందిన పేద ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు బుషిపాక నర్సింహ్మా, ముక్కముల సోమేశ్, బత్తిని గోపాల్, లోతుకుంట అండాలు, పొన్నెబోయిన పద్మ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు బుషి పాక నర్సింహ్మా,, మండల కార్యదర్శి బత్తిని శేఖర్, గ్రామశాఖ అధ్యక్షుడు బత్తిని ధర్మయ్య గౌడ్, లోతుకుంట దేగయ్య, వల్లందాసు నవీన్,వడ్డేపల్లి యాదగిరి, వడ్డేపల్లి హరికృష్ణ, బట్టు మహేష్ ,ఇందిరమ్మ లబ్ధిదారులు పాల్గోన్నారు.






## మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు చోటు కల్పించాలి : లింగస్వామి

**చౌటుప్పల్, జూన్ 6(వార్త వేదిక సూర్య):** రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో అత్యధిక జనాభా కలిగిన మాదిగ సామాజిక వర్గానికి అవకాశం కల్పించాలని ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి మాదిగ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రివర్గం ఏర్పాటులో, పార్లమెంటు అభ్యర్థుల ఎంపికలో మాదిగలను మోసం చేసిందని, కనీసం ఇప్పటికైనా వాస్తవాలను గుర్తించి మాదిగలకు మంత్రిగా వర్గ విస్తరణలో చోటు కల్పించాలని, లేదంటే మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని లింగస్వామి మాదిగ పేర్కొన్నారు.





## శ్రీశ్రీశ్రీ మరుంధతి దేవి(మద్దెలమ్మ) దేవాలయ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం

**సంస్థాన్ నారాయణపురం,జూన్ 6(వార్త వేదిక సూర్య):** సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో పద్మశాలి కుల సంఘం వారిచే శ్రీ శ్రీ మరుంధతి దేవి, (మద్దెలమ్మ),దేవాలయ నిర్మాణము మండల కేంద్రంలోని ఫలక్నామ గుట్ట ఆవరణలో నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం అధ్యక్షులు సురపె ల్లి జనార్ధన్,కమిటీ,గ్రామ ప్రజల ఆధ్వర్యంలో జరిగింది. ఈ మద్దెలమ్మ దేవత మహిమ చూసినట్లయితే ఊరిలో కరువు,తీవ్ర వర్షాభావ పరిస్థితులు,కరువు కాటకాలు ఏర్పడి నప్పుడు మద్దెలమ్మ దేవతను ఆరాధించినట్లయితే కరువుకాటకాల నుండి విముక్తులమై,రైతులకు పాడిపంటలు అధిక సంఖ్యలో వృద్ధి చెందాయని పెద్దలు చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో దువ్వ అంజయ్య,వంగరి రఘు,దోర్నాల బిక్షపతి,పత్రికా విలేఖరి సింగం కృష్ణ,సురపల్లి వెంకటేశం,(లప్లీ),గంజి వేణు,దోర్నాల శ్రీనివాస్,విడం జనార్ధన్,సురపల్లి వెంకటేశం,పగిడిమర్రి విష్ణు,సురపెల్లి జవహర్, సోలాపురం కృష్ణ దాస్,సోలాపురం నారాయణ,గోశిక స్వామి,చిలుకూరి శ్రీనివాసులు, గ్రామ ప్రజలు,భక్తులు,తదితరులు, పాల్గొన్నారు.



## వెలిమినేడులో ప్రొఫెసర్ జయశంకర్ సార్ బడిబాట

### కార్యక్రమంలో పాల్గొన్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి

**చిట్యాల రూరల్, జూన్ 06(వార్తా వేదిక సూర్య):** వెలిమినేడు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, మండల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు,అంగన్ వాడీ టీచర్ లు,ఆశా వర్కరులు ,గ్రామ పెద్దలతో కలిసి ర్యాలీ నిర్వహించిన అవగాహన కల్పించడం జరిగింది. బడి ఈడు పిల్లలను బడికి



పంపించి, గ్రామ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచి మన బడిని కాపాడుతూ....ప్రభుత్వం ద్వారా అందించే ఉచిత నాణ్యమైన విద్యను పొందాలని వెలిమినేడు సహకార పరపతి సంఘం చైర్మన్ ఏనుగు రఘు మారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి తాటికొండ లింగస్వామి గారు, మాజీ వార్డు సభ్యులు కాటం సత్తయ్యలి, అంశాల సత్యనారాయణలి, దేవిరెడ్డి సుధాకర్ రెడ్డిలి, అంతటి రాజులి, దేశగోని మల్లేష్లి గోలి గణేష్లి,అంశాల అనిల్లి, అంశాల శ్రవణ్లి,అరూరి శివ కుమార్లి తదితరులు పాల్గొన్నారు

## భక్తికి, త్యాగానికి, సహనానికి ప్రతీక 'బక్రీద్'

### ముస్లిం సోదరసోదరీమణులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు

### -బీఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

**దేవరకొండ, జూన్ 6(వార్త వేదిక సూర్య):** భక్తికి, త్యాగానికి, సహనానికి బక్రీద్ పండుగ ప్రతీక అని బీఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పేర్కొన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరసోదరీ మణులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. భక్తి, శ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగను జరుపుకోవాలని సూచించారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించు కుంటూ ముస్లింలు బక్రీద్ పండుగను జరుపుకుంటారని అన్నారు. పేదల పట్ల జాలి, దయ కలిగి ఉండటమే బక్రీద్ ఇచ్చే సందేశమన్నారు. అల్లాహ్ ఆశీస్సులు ప్రజలందరికీ ఎల్లప్పుడూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు.



# రెస్టారెంట్లు, బేకరీలు పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలు పాటించాలి

### - మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

**చౌటుప్పల్, జూన్ 6(వార్త వేదిక సూర్య):** హెూటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, స్వీట్ షాప్ లలో పరిశుభ్రతను, నాణ్యతాప్రమాణలను తప్పనిసరిగా పాటించాలని చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ కోమటిరెడ్డి నరసింహారెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 5వ రోజు శుక్రవారం చౌటుప్పల్ మున్సిపాలిటీలోని 4వ వార్డులో మున్సిపల్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ జోష్ణ తో కలిసి తడి, పొడి చెత్త, హెూమ్ కంపోస్ట్ పై స్థానిక ప్రజలు, స్థానిక సెల్ఫ్ ఎంప్లాయ్ గ్రూప్ సభ్యులతోటి అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో హెూటల్స్, రెస్టారెంట్లు, బేకరీ షాప్స్, స్వీట్ షాప్ వారితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ కోమటిరెడ్డి నరసింహారెడ్డి మాట్లాడుతూ పాటించాల్సిన నాణ్యత ప్రమాణాల గురించి వివరించారు. ఇందులో ప్రతి ఒక్క షాపు యజమాని మున్సిపల్ నుంచి ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని, మంచి పరిశుభ్రత, నాణ్యత పాటించవలెనని, లేనియెడల పెనాల్టీ విదించబడునని తెలిపారు.



ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, శానిటేషన్ ఇన్స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ రేణు కుమార్, స్థానిక సెల్ఫ్ ఎంప్లాయ్ గ్రూప్ సభ్యులు, హెూటల్స్ యజమానులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

### - మార్కెట్ చైర్మన్ వెంకటయ్య, తహసిల్దార్ వీరాబాయి

**చౌటుప్పల్, జూన్ 6(వార్త వేదిక సూర్య):** కళ్యాణ లక్ష్మి, సీఎం రిలీఫ్ పందు పథకాలు వేద కుటుంబాలకు ఎంతో మేలు చేస్తాయని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటయ్య తెలిపారు.

మునుగోడు శాసన సభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో మంజూరైన కళ్యాణ లక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శు క్రవారం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల తాసిల్దార్ వీరా బాయితో కలిసి మార్కెట్ చైర్మన్ వెంకటయ్య



చౌటుప్పల్ మున్సి పాలిటీ, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

40 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను, 38 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించారు.

ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, మునుగోడు ఎన్నికల సమన్వయ కర్త పబ్బు రాజు గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొయ్యడ సైదులు గౌడ్, పార్టీ నాయకులు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, బోయ దేవేందర్, మొగుదాల రమేష్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్లు, మాజీ కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







# సోమరం సత్తయ్య ఇంటిలో అంగరంగ వైభవంగా శ్రీనివాస కళ్యాణం

**చౌటుప్పల్,జూన్ 6(వార్త వేదిక సూర్య):**

చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో తగనపల్లి రోడ్డులో సోమవారం రోజున సోమవారం సత్తయ్య వెంకటమ్మ దంపతులు నూతన గృహప్రవేశం సందర్భంగా లోకకళ్యాణార్థమై శ్రీ శ్రీనివాస కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు.

తిరుమల నుండి వేదపండిలను తీసుకువచ్చి శ్రీనివాస కళ్యాణం చేశారు. వర్షాలు బాగా కురవాలని ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని వారు కోరారు.

ఈ కళ్యాణాన్ని తిలకించడానికి మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు రమేష్ దీప్తి సురేష్ సుష్మ మరియు భక్తులు హాజరైనారు.

# ఆరు నూరైనా మూసీ నదిని ప్రక్షాళన చేస్తాం..

(మొదటి పేజీ తరువాయి)

అప్పగించమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిరుపేదలకు 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని, గతం నుండి పేదోడు ఇందిరమ్మ ఇండ్లలోనే ఉంటున్నాడని చెప్పారు. ఆలేరు నియోజకవర్గాన్ని అన్నిరకాలుగా అభివృద్ధి చేస్తామని, ఎట్టి పరిస్థితులలో గంధమల్ల రిజర్వాయర్ ను పూర్తి చేస్తామన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అన్ని వర్గాల పిల్లలు ఒకే చోట చదువుకునే విధంగా 100 నియోజకవర్గాలలో 20వేల కోట్ల రూపాయలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం వచ్చిన మొదటి సంవత్సరంలోనే 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని, ప్రైవేట్ రంగంలో లక్ష ఉద్యోగాలు కల్పించామన్నారు. ఆరు నూరైన మూసీ నదిని ప్రక్షాళన చేసి గోదావరి నది జలాలతో మూసిని నింపుతామని తెలిపారు. గత 10 ఏళ్లలో గత ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టులపై 2 లక్షల కోట్లు ఖర్చు చేస్తే ఎస్ఎల్బీసీకి, డిండికి నిధులు ఎందుకు ఇవ్వలేదని? ఎందుకు పూర్తి చేయలేదని? ముఖ్యమంత్రి ప్రశ్నించారు. తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డ్ తరహాలో యాదగిరిగుట్ట టెంపుల్ కు టిటిడి లాగే వైటిడి (యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్ మెంట్) బోర్డ్ ని ఏర్పాటు చేసుకోబోతున్నామని, తిరుపతిలో పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం మాదిరిగానే ఇక్కడ చేపట్టే ప్రభుత్వ వైద్య కళాశాలను యూనివర్సిటీ స్థాయికి తీసుకెళ్తామని, అలాగే విద్యాసంస్థలను యూనివర్సిటీ స్థాయికి తీసుకెళ్లి దేశంలోనే గుర్తింపు ఉన్న యూనివర్సిటీగా తీర్చిదిద్దు తామన్నారు. గత ప్రభుత్వం యాదగిరిగుట్ట మీద ఎవరు నిద్రించకూడదని నిషేధం విధిస్తే తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ నిషేధాన్ని తొలగించి గుట్టపైకి వెళ్లే విధంగా ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ సన్న బియ్యం ద్వారా 80శాతం ప్రజలకు కడుపునిండా అన్నం పెడుతున్నామని, సన్న బియ్యం పై 11,000 కోట్లు ఖర్చు చేసి ప్రతి ఒక్కరికి ఆరు కేజీల బియ్యం ఇస్తున్నామని చెప్పారు. దశాబ్ద కాలంగా పెండింగ్లో ఉన్న గంధమల్ల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ను 574 కోట్లతో చేపట్టి పూర్తి చేయనున్నామని, రిజర్వాయర్లో ఎక్కువ గ్రామాలు ముంపునకు గురికాకుండా రిజర్వాయర్ సామర్థ్యాన్ని 1.4 టీఎంసీలకు తగ్గించి 60 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చేలా రూపొందించడం జరిగిందని తెలిపారు. గత ప్రభుత్వం ఎస్ఎల్బిసి, డిండి ప్రాజెక్టులతో పాటు, కృష్ణా నదిపై లిఫ్ట్ ఇరిగేషన్ ప్రజక్టులను చేపట్టలేదని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి నల్గొండ జిల్లాలో నిర్మాణంలో ఉన్న అన్ని ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి, బునియదిగానీ కాలువ అన్నింటిని పూర్తి చేస్తామని, అయితే లిఫ్ట్ ఇరిగేషన్ల కింద భూసేకరణను పూర్తి చేసే బాధ్యతను సంబంధిత శాసనసభ్యులు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వం డిండికి ఎక్కడినుండి నీరు తీసుకోవాలో గుర్తించలేక పోయిందని, అలాంటిది తాము 1800 కోట్ల రూపాయలతో ఎదుల రిజర్వాయర్ నుండి డిండి ప్రాజెక్టును మొదలు పెట్టబోతున్నమని, తమ ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేస్తామని తెలిపారు. ప్రపంచంలోనే అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి ఎస్ఎల్ బి ని పూర్తి చేస్తామని చెప్పారు. తుమ్మడి హట్టి ప్రాజెక్టుకు నీళ్లు తీసుకువచ్చిన విధంగానే గంధమల్లకు నీళ్లు తీసుకువచ్చి సకాలంలో పూర్తి చేస్తామని చెప్పారు.

రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉంటుందని, సన్న బియ్యంతో పేదవాడికి రెండు పూటలా అన్నం పెడుతున్నామని, ఇచ్చిన వాగ్దానాలే కాకుండా,



ఇవ్వని వాటిని కూడా నెరవేరుస్తున్నామని, ఆలేరు నియోజకవర్గంలో మిషన్ భగీరథ కింద ప్రతి ఇంటికి మంచినీరు ఇవ్వనున్నమని, యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో తాగునీటితో పాటు, ఇండ్లు , డ్రైనేజి లు అన్ని కట్టిస్తామని తెలిపారు.

భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి చేస్తున్న పథకాలను వివరించారు.

సమావేశానికి అధ్యక్షత వహించిన ఆలేరు శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ నియోజక వర్గంలో ఏ ఎం ఆర్ పి కింద మిగిలిపోయిన 10 కిలోమీటర్ల ఉప కాలువ పనులకు నిధులు ఇచ్చి పూర్తి చేయాలని, తుర్కపల్లి మండలానికి ఇండస్ట్రియల్ పార్కు మంజూరు చేయాలని, గుండాల కాల్వపనులకు నిధులు మంజూరు చేయాలని, బొమ్మల రామారంలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలు తీర్చాలని, కష్టాల్లో ఉన్న మదర్ డైరీ ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు...

అంతకుముందు ముఖ్యమంత్రి 574.56 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న గంధమల్ల రిజర్వాయర్ పనులకు శంకుస్థాపన చేశారు. 200 కోట్ల రూపాయలతో నిర్మించే యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి, యాదాద్రి భువనగిరి జిల్లాలో 183 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న నూతన ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో ఒకటో వార్డు నుండి 12వ వార్డు వరకు 25.5 50 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్లు, బిటి రోడ్లు, స్ట్రాం వాటర్ డ్రైనేజీ పనులకు పనులకు, 7.50 కోట్ల రూపాయల వ్యయంతో కొలనుపాక లో చేపట్టనున్న హెచ్ ఎల్ బి నిర్మాణ పనులకు, 6 కోట్ల రూపాయల వ్యయంతో కల్వలలో చేపట్టే హెచ్ ఎల్ బి నిర్మాణ పనులకు, మోట కొండూరు మండల కేంద్రంలో 8.25 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న తహసిల్దార్, ఎంపీడీవో, పోలీస్స్టేషన్ భవనాల నిర్మాణానికి, యాదగిరిగుట్ట మండలం దాతర్ పల్లి గ్రామంలో 22.75 కోట్ల రూపాయల వ్యయం తో నిర్మించనున్న 20 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాం పనులకు, 21.14కోట్ల రూపాయల వ్యయంతో ఆలేరు నియోజక వర్గంలో సి ఆర్ ఆర్, ఎం ఆర్ ఆర్ పనులతో చేపట్టే బిటి రోడ్ల పనులకు,



ఆలేరు మార్కెట్ యార్డులో 2.75 కోట్లు రూపాయల వ్యయంతో చేపట్టనున్న 2500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాం పనులకు సీఎం శంకుస్థాపనలు చేశారు.

ఈ సందర్భంగా ముగ్గురు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేశారు. స్వయం సహాయక మహిళా సంఘాలకు 54 కోట్ల 70 లక్షల రూపాయల బ్యాంక్ లింకేజీ చెక్కులను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమాలలో రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దనసరి సీతక్క, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ,కుంభం అనిల్ కుమార్ రెడ్డి, వేముల వీరేశం, మందుల సామెల్, ఎమ్మెల్సీలు శంకర్ నాయక్, తీన్మార్ మల్లన్న, శ్రీపాల్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, డైరీ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, పర్యటక శాఖ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డిసిపి ఆకాన్స్ యాదవ్, మాజీ సర్పంచ్ ల ఫోరం రాష్ట్ర కార్యదర్శి బీర్ల శంకర్, మదర్ డెయిరీ చైర్మెన్ మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు పాండవుల భాను ప్రకాష్ గౌడ్, మదర్ డెయిరీ డైరెక్టర్లు గొల్లపల్లి రాంరెడ్డి, శ్రీధర్ రెడ్డి, మందడి ప్రభాకర్ రెడ్డి, నాయకులు మోత్కుపల్లి ప్రవీణ్, బుడిగె పెంటయ్య గౌడ్, గిరి, గౌటే లక్ష్మణ్, సిల్వేరు బాలరాజు గౌడ్, నమిల మహేందర్ గౌడ్, ఆడెపు శ్రీశైలం, రాంజీ నాయక్ చౌహాన్, విఠల్ నాయక్, నమిల కేదారి, బల్ల యాదేశ్, ఇంజ నరేష్, కళ్లెం పాండు తదితరులు పాల్గొన్నారు.

## 'డకాయిట్' జూన్ 8 నుంచి
# క్రూషియల్ షెడ్యూల్ ప్రారంభం

అడివి శేష్ హైలీ యాంటిసిపేటెడ్ పాన్-ఇండియన్ థ్రిల్లర్ 'డకాయిట్. మృణాల్ ఠాకూర్ హీరోయిన్ గా నటిస్తున్నారు. ఇటీవలే విడుదలైన ఫైర్ గ్లింప్స్ ఇంటెన్స్ యాక్షన్, స్టైలిష్ విజువల్స్ తో



అదిరిపోయింది. నేషనల్ వైడ్‌గా సెన్సేషన్ క్రియేట్ చేసింది. విజువల్ గా ఫైర్ గ్లింప్స్ కొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేసింది. ప్రస్తుతం ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. తాజాగా అడివి శేష్ డకాయిట్ కోసం డబ్బింగ్ టెస్ట్ పూర్తి చేశారు. దీనికి సంబంధించిన ఫోటోని సోషల్ మీడియాలో షేర్ చేశారు. అలాగే టీం జూన్ 8 నుంచి క్రూషియల్ షూటింగ్ షెడ్యూల్ ని ప్రారంభించనున్నారు. ఈ షెడ్యూల్ లో కీలక సన్నివేశాలని చిత్రీకరించనున్నారు. ఈ చిత్రానికి షానియల్ డియో దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని సుప్రియా యార్లగడ్డ నిర్మాతగా, అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రం ఈ క్రిస్మస్, డిసెంబర్ 25న గ్రాండ్ థియేట్రికల్ విడుదల కానుంది. ఈ హాలిడే బాక్సాఫీస్ ను షేక్ చేస్తోందని చెప్పడం ఎలాంటి సందేహం లేదు. శేష్‌కు ఇది తొలి హాలిడే రిలీజ్ కావడం విశేషం.

## ముసుగు వెనకున్న 'మిత్ర మండలి'

బన్నీ వాస్ సమర్పణలో సప్త అశ్వ మీడియా వర్క్స్, వైరా ఎంటర్‌టైన్మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న నూతన చిత్రం నుంచి ఇటీవల ప్రీ లుక్ విడుదలైంది. ముసుగు అవతారాలలో ఉన్న నటులు ఎవరో తెలుసుకోవాలనే ఆసక్తి అందరిలో కలిగింది. దీని గురించి సామాజిక మాధ్యమాల్లో కూడా తెగ చర్చ జరిగింది. తాజాగా ఈ చిత్రం నుంచి టైటిల్ తో కూడిన ఫస్ట్ లుక్ ను విడుదల చేశారు నిర్మాతలు.



ఈ చిత్రానికి "మిత్ర మండలి" అనే ఆసక్తికర టైటిల్ ను ఖరారు చేశారు. టైటిల్ తో పాటు, అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫస్ట్ లుక్ పోస్టర్ కూడా విడుదలైంది. ఫస్ట్ లుక్ అందరి అంచనాలను అందుకునేలా కట్టిపడేసేలా ఉంది. ఈ పోస్టర్ నీలిరంగు ముసుగుల వెనుక ఉన్న గ్యాంగ్ ను పరిచయం చేసింది. ప్రియదర్శి, రాగ్ మయూర్, విష్ణు ఓయ్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. అపరిమిత వినోదాన్ని అందించడానికి ఈ గ్యాంగ్ సిద్ధమవుతోంది.

సోషల్ మీడియా సంచలనం నిహారిక ఎన్.ఎం. "మిత్ర మండలి" చిత్రంతో తెలుగులోకి అరంగేట్రం చేస్తుండటం విశేషం. సోషల్ మీడియా ద్వారా వివిధ భాషల ప్రేక్షకులకు చేరువైన నిహారిక.. ఇటీవల 'మిషన్ ఇంపాజిబుల్ – ది ఫైనల్ రెకనింగ్' కోసం టామ్ క్రూజ్‌తో కలిసి పనిచేసి వార్తల్లో నిలిచారు.

అద్భుతమైన నటన, కామిక్ టైమింగ్, భిన్నమైన పాత్రల ఎంపికతో ప్రియదర్శి తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయనకు 'మ్యాడ్' ఫేమ్ విష్ణు ఓయ్, రాగ్ మయూర్, ప్రసాద్ బెహరా వంటి ప్రతిభగల నటులు తోడయ్యారు. ఈ నలుగురు కలిసి 'మిత్ర మండలి'తో అద్భుతమైన వినోదాన్ని అందిస్తారు అనడంలో సందేహం లేదు.



## వీరమల్లు మళ్లీ వాయిదా

ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాలలో 'హరి హర వీర మల్లు' ఒకటి. ఈ చిత్ర విడుదల గురించి జరుగుతున్న ప్రచారాలు, పెరుగుతున్న ఊహాగానాలు నేపథ్యంలో నిర్మాతలు అధికారిక ప్రకటన విడుదల చేశారు. "అచంచలమైన ఓపిక మరియు నమ్మకంతో 'హరి హర వీరమల్లు' సినిమాకు తోడుగా నిలిచిన అభిమానులు, శ్రేయోభిలాషులు మరియు సినీ ప్రేమికులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు.

గతంలో ప్రకటించిన జూన్ 12వ తేదీకి చిత్రాన్ని మీ ముందుకు తీసుకురావడానికి అవిశ్రాంత ప్రయత్నాలు చేస్తున్నాము. అయినప్పటికీ ఆ తేదీకి చిత్రాన్ని థియేటర్లలోకి తీసుకురాలేకపోతున్నామని తెలియజేస్తున్నాము. కష్టమైనయినప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ గారి యొక్క ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని మరింత గొప్పగా మలచాలనేదే మా ప్రయత్నం. ప్రతి ఫ్రేమ్ పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, అద్భుతమైన చిత్రంగా మలిచే ప్రయత్నంలో నిమగ్నమై ఉన్నాము. అందుకే మేము మరి కొంత సమయం తీసుకుంటున్నాము. మీ ఎదురుచూపులకు బహుమతిగా గొప్ప చిత్రాన్ని అందిస్తామని హామీ ఇస్తున్నాము."

మరోవైపు, సామాజిక మాధ్యమాల్లో 'హరి హర వీరమల్లు' చిత్రం గురించి తప్పుడు వార్తలు ప్రచారమవ్వడం మేము గమనించాము. చాలామంది తమకు తోచినది రాసేస్తున్నారు. ధృవీకరించని వార్తలను నమ్మవద్దని, వాటిని వ్యాప్తి చేయవద్దని మేము ప్రతి ఒక్కరినీ కోరుతున్నాము. దయచేసి మా అధికారిక హ్యాండిల్స్ ద్వారా మాత్రమే సినిమాకి సంబంధించిన అప్డేట్ల కోసం వేచి ఉండండి. అప్పటి వరకు, ఎటువంటి ప్రచారాలను నిజమని భావించకండి. 'హరి హర వీరమల్లు' చిత్రం ఒక అద్భుతమైన ప్రయాణం. వందలాది మంది కళాకారులు, సాంకేతిక నిపుణులు కలిసి వెండితెరపై అద్భుతాన్ని సృష్టించడానికి 24 గంటలూ తమ శక్తికి మించి కృషి చేస్తున్నారు. ఈ ఆలస్యం మన సహనాన్ని పరీక్షించవచ్చు. కానీ, అంతకంటే గొప్పది ఏదో రూపుదిద్దుకుంటుందని కూడా ఇది సూచిస్తుంది.



## మధురమైన రొమాన్స్‌తో విడుదలకు జోరుగా హుషారుగా షికారు పోదమ

క్రేజీ యువ కథానాయకుడు సంతోష్ శోభన్, అందాల భామ ,ఫల్గుణి ఖన్నా జంటగా జి .సుభాష్ చంద్ర దర్శకత్వంలో రూపొందిన చిత్రం "జోరుగా హుషారుగా షికారు పోదమ ". తొలికాపీతో సహా అన్ని కార్యక్రమాలనుపూర్తి చేసుకున్న ఈ చిత్రం విడుదలకు సిద్ధమైందని త్రిపుర క్రియేషన్స్ అధినేత చిత్రం ,వరల్డ్ నెగటివ్ హక్కుదారుడు మురళీకృష్ణ వంకాయలపాటి తెలిపారు. ఇంకా మాట్లాడుతూ, "ఇది మధురమైన రొమాంటిక్ కామెడీగా సాగుతుంది. ఇంకా చెప్పాలంటే...లైట్ హార్టెడ్ ట్రావెల్ మ్యూజికల్ లవ్ స్టోరీ. చూస్తున్నంత సేపు హాయిగా నవ్వుకుంటుంది. ఇండియా మొత్తం చుట్టి వచ్చినట్టుగా ఉంటుంది.. సంతోష్ శోభన్ కు కెరీర్ పరంగా మరింత మంచి పేరు తెచ్చిపెడుతుంది. కనువిందు చేసే సినిమాటోగ్రఫీ, వీనులవిందైన సంగీతం చిత్రానికి ఓ ఆకర్షణగా నిలుస్తాయి. త్వరలోనే చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం" అని చెప్పారు.

## "కలివి వనం" టీజర్ లాంచ్

వృక్షో రక్షతి రక్షితః అన్నారు పెద్దలు. ఇలాంటి మంచి సందేశాన్నిస్తూ వనాలను సంరక్షించుకోవాలనే నేపథ్యంతో పూర్తి తెలంగాణ పల్లెటూరి బ్యాక్ డ్రాప్ లో చిత్రీకరించిన అరుదైన సినిమా కలివి వనం. ఈ చిత్రంలో రఘుబాబు, సమ్మెట గాంధీ, విజయలక్ష్మి, బిత్తిరి సత్తి, బలగం సత్యనారాయణ, మహేంద్ర నాథ్, సతీష్ శ్రీ చరణ్, అశోక్ తదితరులు కీలకపాత్రలు పోషించారు. హీరోయిన్ గా నాగదుర్గ పరిచయమవుతోంది. కలివి వనం సినిమాను ఏఆర్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై రాజ్ నరేంద్ర రచనా దర్శకత్వంలో మల్లికార్జున్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి లు నిర్మించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న చిత్ర టీజర్‌ను హైదరాబాద్‌లో విడుదల చేశారు..



ఈ కార్యక్రమానికి మీడియా మిత్రులు జర్నలిస్ట్ టీ.యఫ్.జె.ఏ. ప్రెసిడెంట్ లక్ష్మి నారాయణ, జర్నలిస్ట్ టీ.యఫ్.జె.ఏ. వైస్ ప్రెసిడెంట్ వై. జె రాంబాబు , గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డు జ్యూరీ మెంబెర్ లక్ష్మి నారాయణ, సినీజోష్ సీఈఓ రాంబాబు, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రాఘవ, దుప్పర్ల సత్యనారాయణల చేతుల మీదుగా చిత్ర టీజర్ ను గ్రాండ్ గా విడుదల చేశారు. అనంతరం దుప్పర్ల సత్యనారాయణ మాట్లాడుతూ – పంచభూతాల్లాగే చెట్టు కూడా ప్రకృతి మాత. పంచభూతాలతో పాట ఆ చెట్టు తల్లి ఆశీస్సులు ఈ చిత్రానికి ఉండాలి. వనాలు బాగుంటే జనాలు బాగుంటారు. నాకు కూడా చెట్లంటే ఇష్టం. అభివృద్ధి పేరుతో చెట్లను నరకడం అన్యాయం. "కలివి వనం" చిత్రంతో పర్యావరణం గురించి మంచి సందేశం ఇచ్చారు. ఈ సినిమా మన సమాజానికి ఒక మార్గం వేయాలి, పర్యావరణ రక్షణ గురించి మన ప్రజల్లో ఆలోచన రేకెత్తించాలి అన్నారు.

నటుడు బలగం సత్యనారాయణ మాట్లాడుతూ – సామాజిక స్పృహతో చేసిన సినిమా "కలివి వనం". బలగం చిత్రంతో నాకు ఎంత పేరొచ్చిందో ఈ చిత్రానికి కూడా అలాంటి గుర్తింపే వస్తుందని ఆశిస్తున్నా. సినిమాలో నటించేప్పుడు మా డైరెక్టర్ గారు తనకు కావాల్సిన ఔట్ పుట్ వచ్చేవరకు పనిచేయించారు అన్నారు.

స్పోర్ట్స్ | SPORTS

# రోహిత్ శర్మనే నాకు ఆదర్శం

### - యువ క్రికెటర్ శుభ్‌మన్ గిల్

టీమిండియా క్రికెట్‌లో కొత్త అధ్యాయం ప్రారంభమైంది. ఇటీవల టెస్ట్ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టిన యువ క్రికెటర్ శుభ్‌మన్ గిల్, గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో తన భావాలను బహిరంగంగా పంచుకున్నాడు. ఈ సమావేశంలో గిల్‌తో పాటు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కూడా పాల్గొన్నారు. ఇంగ్లండ్ పర్యటన నేపథ్యంలో జరిపిన ఈ సమావేశంలో శుభ్‌మన్ కీలక వ్యాఖ్యలు చేశాడు.గిల్మాట్లాడుతూ,రోహిత్ శర్మ తరహాలోనే ఆటగాళ్ల కెప్టెన్‌గా ఉంటానని టీమిండియా నయా సారథి తెలిపాడు. టీమిండియా టెస్ట్ కెప్టెన్సీ సవాల్‌తో కూడుకున్నదని, ఈ ఛాలెంజ్‌ను స్వీకరించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని చెప్పాడు. కెప్టెన్‌గా ప్రత్యేకమైన శైలిని అనుసరించానని స్పష్టం చేశాడు. ఆటగాళ్లలో భద్రతభావాన్ని కలిగిస్తానన్నాడు. ఇంగ్లండ్ పర్యటన నేపథ్యంలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తో కలిసి శుభ్‌మన్ గిల్ గురువారం మీడియా సమావేశంలో పాల్గొన్నాడు. ఇంగ్లండ్ పర్యటనను ఉద్దేశించి ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు. గిల్ మాట్లాడుతూ,వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా బుమ్రా అన్ని మ్యాచ్‌లకు అందుబాటులో లేకపోతే అతని స్థానాన్ని భర్తీ చేయగల ఆటగాళ్లు జట్టులో ఉన్నారని గిల్ తెలిపాడు. 'భారత జట్టులో నాణ్యమైన పేసర్లు ఉన్నారు. మా పేస్ విభాగం బలంగా ఉంది. మా పేసర్లు ఎలాంటి స్థితిలోనైనా రాణించి జట్టును గెలిపించగలరు.కెప్టెన్‌గా నేను ప్రత్యేకమైన శైలిని అనుసరించను. రోహిత్ శర్మ తరహాలోనే ఆటగాళ్లకు అండగా ఉంటూ వారితో సత్సంబంధాలు పెంచుకుంటా. వారితో మాట్లాడుతూ భద్రతాభావాన్ని కలిగిస్తా. వాళ్లతో వాళ్ల బలాలు, బలహీనతల గురించి చర్చిస్తా.ఓ సారథిగా ఇది చాలా ముఖ్యం. భద్రతా భావం కలిగినప్పుడే ఆటగాళ్లు నూరు శాతం కష్టపడతారు.ఇంగ్లండ్ పర్యటనలో బ్యాటర్‌గా జట్టును ముందుండి నడిపించాలని భావిస్తున్నా. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ సుదీర్ఘ కాలం భారత జట్టుకు ఆడి ఎన్నో విజయాలు అందించారు. వారి స్థానాలను భర్తీ చేయడం చాలా కష్టం.అని శుభ్‌మన్ గిల్ చెప్పుకొచ్చాడు. జూన్ 20 నుంచి టీమిండియా ఇంగ్లండ్ పర్యటన ప్రారంభం కానుంది. లీడ్స్ వేదికగా జరిగే తొలి టెస్ట్‌తో ఐదు టెస్ట్‌ల సిరీస్ మొదలవ్వనుంది. ఈ సిరీస్‌తోనే డబ్ల్యూటీసీ 2027 ఎడిషన్ కు తెరలేవనుంది. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ లేకుండా టీమిండియా ఇంగ్లండ్‌లో పర్యటించనుంది. దాంతో ఈ సిరీస్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది.



## స్పిన్నర్ పీయూశ్ చావ్లా రిటైర్మెంట్



టీమ్ఇండియా సీనియర్ లెగ్ స్పిన్నర్ పీయూష్ చావ్లా అంతర్జాతీయ క్రికెట్ కు వీడ్కోలు పలికాడు. తాను అన్ని ఫార్మాట్ల క్రికెట్ నుంచి తప్పుకుంటున్నట్లు శుక్రవారం ప్రకటించాడు. తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని ఇన్‌స్టాలో ప్రకటిస్తూ పోస్ట్ షేర్ చేశాడు. కెరీర్‌లో తనకు సహాయ సహకారాలు అందించిన కుటుంబ సభ్యులు, ఐపీఎల్ ఫ్రాంఛైజీలు, అభిమానులకు ఈ సందర్భంగా థాంక్స్ చెప్పాడు.కాగా, 36ఏళ్ల పీయూష్ 2007 టీ20 ప్రపంచ కప్, 2011 వన్డే వరల్డ్ కప్ గెలిచిన భారత జట్టులో సభ్యుడు. భారత్ తరఫున మూడు టెస్టులు, 25 వన్డేలు, 7 టీ20లు ఆడాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఎక్కువగా అవకాశాలు దక్కలేదు. అంతర్జాతీయ క్రికెట్‌లో పీయూశ్ ఆఖరి మ్యాచ్ ఆడి దశాబ్దం దాటింది. 2012 డిసెంబర్‌లో ఇంగ్లాండ్‌పై లాస్ట్ మ్యాచ్ అడాడు. టెస్టుల్లో 7, వన్డేల్లో 32, టీ20ల్లో 4 వికెట్లు కూల్చాడు.అయితే అంతర్జాతీయ క్రికెట్‌లో రాణించలేకపోయినా, ఫ్రాంఛైజీ క్రికెట్‌లో పీయూష్ చావ్లా సత్తా చాటుకున్నాడు. ఐపీఎల్ మాత్రం అదరగొట్టాడు. కోల్‌కతా నైట్‌రైడర్స్, ముంబయి ఇండియన్స్ జట్ల తరపున ఆడాడు. కెరీర్‌లో 192 మ్యాచ్‌ల్లో 192 వికెట్లు పడగొట్టాడు. అలాగే 446 ఫస్ట్ క్లాస్ వికెట్లు, 319 టీ20 వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్‌లో పలు టీమ్‌ల తరపున ఆడాడు. 2012, 2014లో ఐపీఎల్ టైటిల్ గెలిచిన కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టులో సభ్యుడిగా ఉన్నాడు.

## ఆర్సీబీ మార్కెటింగ్ హెడ్ అరెస్ట్

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మేనేజ్ మెంట్ కు బిగ్ షాక్ తగిలింది. జూన్ 4 బుధవారం ఎం. చిన్నస్వామి స్టేడియం వెలుపల జరిగిన తొక్కిసలాట ఘటనకు సంబంధించి బెంగళూరు పోలీసులు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మార్కెటింగ్ హెడ్ నిఖిల్ సోసాలేను అరెస్టు చేశారు. నిఖిల్ సోసాలే బెంగళూరు నుండి ముంబైకి బయలుదేరినప్పుడు అరెస్టు జరిగింది. బెంగళూరు విమానాశ్రయంలో ఆయనను అరెస్టు చేశారు.నిఖిల్ తోపాటు విజయోత్సవ ఈవెంట్ నిర్వాహక సంస్థ డీఎన్ఏ ఎంటర్ టైన్ మెంట్ నెట్ వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్ కు చెందిన ముగ్గురు సిబ్బందిని కూడా పోలీసులు అరెస్టు చేశారు. ఆర్సీబీ టీమ్ మేనేజ్ మెంట్ నిఖిల్ కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ విజయోత్సవ ఈవెంట్ను కూడా డీఎన్ఏ సంస్థతో కలిసి ఆయనే కోఆర్డినేట్ చేసినట్లు పోలీసులు చెబుతున్నారు. కాగా బుధవారం సాయంత్రం చిన్నస్వామి స్టేడియం దగ్గర జరిగిన తొక్కిసలాటలో 11 మంది మరణించిన విషయం తెలిసిందే. 50 మందికిపైగా గాయపడ్డారు. విజయోత్సవ ర్యాలీ నిర్వహణపై చేసిన భిన్నమైన ప్రకటనలే ఈ దుర్ఘటనకు ప్రధాన కారణమని సోషల్ మీడియాలో చర్చలు మొదలయ్యాయి. అందర్నీ ఏకకాలంలో అనుమతించడం వల్లే ఈ తొక్కిసలాట జరిగిందని ప్రత్యక్ష సాక్షులు అంటున్నారు. కర్నాటక





హైకోర్టు కూడా ఈ ఘటనను సుమోటోగా పరిగణించి విచారణ చేపట్టింది. లక్షలాది మంది క్రీడాభిమానులతో ముడిపడిన కార్యక్రమాన్ని నిర్వహించడంలో వైఫల్యం ఎవరిదో తేల్చి చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో కోర్టు సూచనతో రాష్ట్ర ప్రభుత్వం తొక్కిసలాట ఘటన దర్యాప్తునకు సీఐడీ పోలీసులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. ఘటనకు కర్నాటక క్రికెట్ సమాఖ్య, ఆర్సీబీ ప్రతినిధులను బాధ్యులుగా పేర్కొంటూ వెంటనే అరెస్టు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలోనే తాజాగా అరెస్టులు చోటుచేసుకుంటున్నాయి.

Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**,and **Printed at SURYA DIGITAL PRINTERS,** H.No.132, Markondeya Nagar, Choutuppal Municipality, YadadriBhuvanagiri District, Telangana State508252., and Published at H.No. 132, Markondeya Nagar, Choutuppal Municipality, YadadriBhuvanagiri District, Telangana State508252. **Editor: POLOJU SRINIVASA CHARY. RNI. RNI: TGTEL/25/A0305,** Cell:9985389183. **Email Id:vaarthavedhikasurya.yadadri@gmail.com**